
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం, 8 జనవరి 2025



సంప్రదాయ సెలఏరు

భద్రాచలంలో నిర్వహిస్తున్న ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు విచ్చేసేవారికి ఈసారి సరికొత్త గిరిజన పర్యాటక అనుభూతి కలగనుంది. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, అలవాట్లు, సంప్రదాయ కళాకారులు, గిరిజనుల ఆభరణాలు, దుస్తులు, వేట పరికరాలు ఇలా ఏజెన్సీలో నిత్యం కనిపించే దృశ్యాలను పర్యాటకులకు పంచే ప్రయత్నం చేస్తున్నారు. భద్రాచలంలో 'ఏరు' (కోయభాషలో 'నీరు') పేరిట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికార యంత్రాంగం నిర్వహించే ఈ పర్యాటక కార్యక్రమం 9వ తేదీ నుంచి మూడు రోజుల పాటు సాగనుంది. ఇందుకోసం గోదావరి నదీ తీరం, గిరిజన మ్యూజియం సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దారు. ఈసారి ముక్కోటిని వీక్షించడానికి వచ్చే భక్తులకు రామయ్య దర్శనంతో పాటు పర్యాటక అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేశారు. ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం ద్వారా ఏజెన్సీ జిల్లా అయిన భద్రాద్రి కొత్తగూడేనికి పర్యాటకంగా సరికొత్త శోభను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామని అధికారయంత్రాంగం తెలిపింది.



గిరిజన స్టాల్స్ కోసం ఏర్పాటు చేసిన టెంట్లు



సెల్ఫీ పాయింట్

- ముక్కోటి వేళ భద్రాచలంలో ఏజెన్సీ పర్యాటక పండుగ
- గిరిజన సంస్కృతిని చాటేలా ప్రత్యేక కార్యక్రమాలు
- రేపటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ

వివరాలు : 6లో

నిధులున్నా.. నిర్లక్ష్యమేనా?



దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా ఉంది పాలేరు జేఎన్‌టీయూ కళాశాల పరిస్థితి.. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని జేఎన్‌టీయూ కళాశాలకు గత నవంబరు 30న రూ.108.60కోట్ల నిధులు మంజూరుచేయించిన విషయం తెలిసిందే.. అయితే జేఎన్‌టీయూకి ఏడాదికాలంగా పాలకవర్గం లేకపోవడంతో అధికారులు కళాశాల భవనాల పనుల విషయంలో చొరవ చూపించలేకపోతున్నారు. ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లి వద్ద పాలేరు జేఎన్‌టీయూ కళాశాల ఐటీడీఏ ఒకేషనల్ ట్రైనింగ్ భవనాల్లో నిర్వహిస్తున్న విషయం విదితమే.


- పాలేరు జేఎన్టీయూ భవనాల నిర్మాణంలో తీవ్రజాప్యం
- నిధులు మంజూరైనా ముందుకు సాగని టెండర్ల ప్రక్రియ
- పాలకవర్గం లేకపోవడమే శాపం

ఖమ్మం, జనవరి 7(ఆంధ్రజ్యోతిప్రతినిధి): 2022-23 విద్యా సంవత్సరంలో మంజూరైన ఈ ఇంజనీరింగ్ కళాశాల ప్రస్తుతం రెండో విద్యాసంవత్సరాన్ని నిర్వహిస్తోంది. ఈ కళాశాలకు 30ఎకరాల భూమిని కూడా మద్దులపల్లి వద్ద కేటాయించారు. మరో 17ఎకరాలు కేటాయించాల్సి ఉంది. ఈ కళాశాలకు శాశ్వత భవనాల కోసం రూ.300కోట్లతో మొదటిదశ పనులకు ప్రతిపాదనలు చేశారు. అందులో అడ్మినిస్ట్రేషన్‌బ్లాక్, హాస్టల్‌భవనాలతో పాటు ఆడిటోరియం, క్రీడామైదానాలు, ల్యాబ్‌లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ కాలేజీలో సుమారు 223మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో మొదటి ఏడాదిలో 144మంది ఉండగా రెండో ఏడాదిలో 79మంది ఉన్నారు. ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ తరుణంలో జేఎన్‌టీయూ కళాశాల అని రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎంచుకున్నా సీటు వచ్చిన తర్వాత ఇక్కడ పరిస్థితి చూసి అవాక్కయ్యారు. భవనాలు, ల్యాబులు, పూర్తిస్థాయిలో లెక్చరర్లు లేరని తెలుసుకొని రెండో విడత కౌన్సెలింగ్‌లో ఆప్షన్ మార్చుకుని ఇతర కళాశాలలకు వెళ్లారు. దీంతో విద్యార్థుల సంఖ్య సగానికి పడిపోయింది. కళాశాలకు పూర్తిస్థాయి భవనాల నిర్మాణంలో నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది.

పాలకవర్గం లేకపోవడమే ప్రధాన అవరోధం

తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న జేఎన్‌టీయూ యూనివర్శిటీకి పాలకవర్గం లేకపోవడంతో పాలేరు కళాశాలకు శాపంగా మారింది. తాత్కాలిక వీసీలతో పాలన సాగుతుండడంతో ఏ పనులూ ముందుకు సాగడంలేదు. పాలేరు జేఎన్‌టీయూకు మంత్రి పొంగులేటి చొరవతో నిధులు కేటాయించినా ఇప్పటి వరకు కళాశాల డిజైన్ కూడా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ విభాగం రూపకల్పన చేయలేదని తెలిసింది. అలాగే నిధులు మంజూరైనా టెండర్లు నిర్వహించకపోవడంతో రెండునెలలుగా నిధులు నిరుపయోగంగానే ఉన్నాయి.

పాలేరు జేఎన్‌టీయూతో పాటు ఖమ్మం మెడికల్ కళాశాలకు కూడా నిధులు మంజూరు కాగా రఘునాథపాలెం మండలంలో మెడికల్ కళాశాల పనులు ప్రారంభమై వేగంగా కొనసాగుతున్నాయి. వచ్చే జూన్ నాటికి మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు నిర్వహిస్తున్నారు. శంకుస్థాపన జరగకుండానే పనులు పునాదులు దాటుతున్నాయి. కానీ జేఎన్‌టీయూ కాలేజీ విషయంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జేఎన్టీయూ అధికారులు కళాశాల డిజైన్ పూర్తిచేయించి టెండర్లు నిర్వహించి పనులు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా జేఎన్‌టీయూ అధికారులతో సమీక్ష నిర్వహించి వచ్చే విద్యాసంవత్సరం నాటికి భవనాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



జమలాపురంలో అటవీఅర్బన్ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న భట్టి

జిల్లా పర్యాటక ముఖచిత్రంలో ఎర్రుపాలెం

- అధ్యాత్మికం, ఆహ్లాదం ఉండేలా అభివృద్ధి
- అడవులు, చెరువులను కాపాడుకోవాలి
- సంక్రాంతి తర్వాత ఇందిరమ్మ ఇళ్లు
- డిప్యుటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

6



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

6

తెలంగాణకే తలమానికంగా ఖమ్మం ఖిల్లా

- వేగంగా రోప్‌వే నిర్మాణ పనులు
- పర్యాటకులకు కనువిందు చేసేలా హంగులు
- ఖమ్మం పర్యాటక గుమ్మం కావాలి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



బలరామావతారంలో జానకి రాముడు

- ఘనంగా వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు

6

భద్రాద్రికి ముక్కోటి శోభ

- స్వాగత ద్వారాలు, చాందినీ వస్త్రాలంకరణతో పండుగ కళ
- రేపు శ్రీ సీతారాములకు తెప్పోత్సవం
- 10న ఉత్తరద్వారంలో స్వామివారి దర్శనం

6

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధం

ఇంటర్వ్యూ



- ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశాం
- పంచాయతీ ఓటర్ జాబితాతోనే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు
- 'ఆంధ్రజ్యోతి'తో ఖమ్మం జడ్పీ సీఈవో దీక్షారైనా

ఖమ్మంకలెక్టరేట్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఎప్పుడు ఆదేశాలిచ్చినా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు ఖమ్మం జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి దీక్షారైనా తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని ఆమె తెలిపారు. మంగళవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఎన్నికల సంఘం త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించాలన్న లక్ష్యంతో పంచాయతీ ఎన్నికలతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

ఆంధ్రజ్యోతి: జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు ఆదేశాలేమైనా వచ్చాయా ?

సీఈవో: ఎన్నికల సంఘం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉంది. అయితే ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగా ప్రక్రియ మొత్తం పూర్తి చేశాం. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. జిల్లాలో పంచాయతీ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. పంచాయతీకి సిద్ధం చేసిన ఓటర్ల జాబితానే ఉపయోగించనున్నాం. 20మండలాల్లో 20 జడ్పీటీసీ స్థానాలకు, 289 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఎంపీటీసీ స్థానాలు, జడ్పీటీసీ స్థానాల వివరాలేంటి ?

సీఈవో: జిల్లాలో 20 మండలాలకు 20 జడ్పీటీసీ స్థానాలతో పాటు బోనకల్లు 13, చింతకాని 14, ఏన్కూరు 5, కల్లూరు 18, కామేపల్లి 12, ఖమ్మం రూరల్ 14, కొణిజర్ల 15, కూసుమంచి 17, మధిర 12, ముదిగొండ 17, నేలకొండపల్లి 18, పెనుబల్లి 15, రఘునాథపాలెం 14, సత్తు పల్లి 13, సింగరేణి 16, తల్లాడ 16, తిరుమలాయపాలెం 18, వేంసూరు 13, వైరా 10, ఎర్రుపాలెం మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలున్నాయి.

ఆంధ్రజ్యోతి: ఎన్నికల ప్రక్రియకు అవసరమైన సామగ్రి ఎంత అవసరం ఉంటుంది ?

సీఈవో: మండలాల వారీగా ఎంపీటీసీ స్థానాలకు కావాల్సిన బ్యాలెట్ పేపర్ల ముద్రణ కోసం ప్రత్యేక స్టేషనరీ జిల్లాకు చేరింది. వీటిని జడ్పీ గోదాంలో భద్రపరిచాం. ఎన్నికల లాబుక్స్, కవర్లు, సిద్ధంగా ఉంచాం. ఇతర సామగ్రి కొనుగోలుకు కూడా పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి.

ఆంధ్రజ్యోతి: ఎంత మంది సిబ్బందిని ఈ ఎన్నికల ప్రక్రియలో వినియోగించనున్నారు ?

సీఈవో: జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు 11వేల మంది సిబ్బంది అవసరం ఉంటుందని భావిస్తున్నాం. జిల్లాలో 1,612 పోలింగ్ కేంద్రాలున్నాయి. అవి పెరగవచ్చని భావిస్తున్నాం. పూర్తి స్పష్టత రావాల్సి ఉంది.

సంక్రాంతి ప్రత్యేక రైళ్లు ఇవీ..

రైలు నెంబర్	పేరు	తేదీ	రాక	పోక
02763	హైదరాబాద్- తిరుపతి	జనవరి 8,11,05-02	22:18	22:20
02764	తిరుపతి- హైదరాబాద్	జనవరి 10,13,17	00:44	00:45
07487	నాందేడ్- కాకినాడ	జనవరి 07,14	01:38	01:40
07488	కాకినాడ- నాందేడ్	జనవరి 8,15	01:24	01:26
07654	తిరుపతి- కాచిగూడ	జనవరి 10,17	3:18	3:20
07653	కాచిగూడ- తిరుపతి	జనవరి 4,16	21:52	21:54



మహాకుంభమేళా ప్రత్యేక రైళ్లు ..

రైలు నెంబర్	పేరు	తేదీ	రాక	పోక
07081	గుంటూరు- అహ్మదాబాద్	15-02	01:58	2:00
07082	అహ్మదాబాద్- గుంటూరు	18-02	04:20	04:22
07085	కాకినాడ - అహ్మదాబాద్	21-02	1:58	2:00
07086	అహ్మదాబాద్- విజయవాడ	24-02	3:43	3:45
07093	విజయవాడ- గయా	05- 02	21:43	21:45
07094	గయా- విజయవాడ	7-02	05:25	05:27
07095	కాకినాడ- గయా	08-02	21:43	21:45
07096	గయా- కాకినాడ	10-02	23:55	23:57

మహాకుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

- 15 నుంచి ఖమ్మం రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు
- ఖమ్మం రైల్వే సీసీఐ జాఫర్

ఖమ్మం మామిళ్లగూడెం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అలహాబాద్ ప్రయోగరాజ్‌లో జరిగే కుంభమేళాకు దక్షిణ మధ్య రైల్వేప్రత్యేక రైళ్లను నడుపుతుందని ఖమ్మం రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ జాఫర్ తెలిపారు. 15వ తేదీ నుంచి ఈ సర్వీసులు నడుస్తాయని తెలిపారు. వీటితో పాటు సంక్రాంతికి కూడా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు తెలిపారు. ఖమ్మం మీదుగా వెళ్లే పలు సర్వీసులకు ఇప్పటికే టిక్కెట్ రిజర్వేషన్లు ప్రారంభమైనట్లు ఆయన మంగళవారం తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రిజర్వేషన్, జనరల్ బుకింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇతర రైల్వే సమాచారం కోసం ఖమ్మం రైల్వేస్టేషన్లో సంప్రదించాలని సూచించారు.

సంక్రాంతికి ఆర్టీసీ 1,030 బస్సులు

- ఖమ్మం రీజియన్ పరిధిలో అదనపు సర్వీసుల ఏర్పాటు
- మహిళలకు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో ఉచిత ప్రయాణం



ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ఖమ్మం రీజియన్ పరిధిలో ఆర్టీసీ అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తోందని ఆర్టీసీ ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజనల్ మేనేజర్ సరిరాం మంగళవారం తెలిపారు. రీజియన్ పరిధిలోని డిపోల నుంచి సుమారు 1,030 బస్సులను నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా తగిన ప్రణాళికలను రూపొందించినట్లు తెలిపారు. 9వ తేదీ నుంచి 20వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 9నుంచి 14వరకు హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు 585 బస్సులను అదనంగా నడుపుతామన్నారు. 15నుంచి 20తేదీలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు నిత్యం తిరిగే బస్సులతో పాటు 445బస్సుల అదనంగా బస్సులు ఉంటాయన్నారు. 11, 12 తేదీల్లో అత్యధికంగా 135బస్సులు నడుపుతామని, ప్రయాణికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచుతామని తెలిపారు. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం గల బస్సుల్లో టికెట్స్ ఆన్‌లైన్‌లోగానీ, దగ్గరలోని బస్టాండ్ టికెట్ రిజర్వేషన్‌కౌంటర్, ఏటీబీ ఏజెంట్ వద్ద ముందస్తుగా రిజర్వేషన్ చేసుకొనవచ్చునని తెలిపారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు నాన్‌స్టాఫ్ బస్సులు 24గంటలు అందుబాటులో ఉంటాయన్నారు. ఖమ్మం నుంచి మణుగూరు, భద్రాచలం, సత్తుపల్లి, కొత్తగుడెం, మధిర, ఇల్లెందు, తదితర ప్రాంతాలకు బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయింకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందని, ప్రయాణికులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఖమ్మం నూతన బస్టాండ్ 9959225979, సిటీ బస్టాండ్ 9959225965, సత్తుపల్లి 9959225990, మణుగూరు 8985361796, కొత్తగుడెం 9959225982, మధిర 7382925289, భద్రాచలం 9959225987 నెంబర్లను సంప్రదించాలని ఆర్ఎం తెలిపారు.

సీతారామ ప్రాజెక్ట్ పనులను వేగిరం చేయాలి

» కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్ట్ పనులు మరింత వేగిరం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనుల పురోగతిపై నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతోఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పనులు ఎంతవరకు పూర్తయ్యాయి, ఇంకా చేపట్టాల్సిన పనులను మ్యాప్ ద్వారా పరిశీలించారు. సత్తుపల్లి ట్రంక్ పనులు, యాతాలకుంట టన్నెల్, జూలూరుపాడు టన్నెల్ పనుల వివరాలు, పంప్ హౌస్‌ల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కాలువల పరిస్థితి, పాలేరు నియోజకవర్గం లోని లింక్ కెనాల్ ఏర్పాటు పనులు, భూ సేకరణ, అటవీభూముల స్థితిగతులు, ఇతర శాఖల అనుమతుల గురించి అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, నీటిపారుదలశాఖ అధికారులు పాల్గొన్నారు.

అజ్ఞాన తిమిరాలను చీల్చే రవి కిరణం



» అవిశ్రాంత సాహిత్య కృషిలో రౌతు రవి
» కవిత్వం, పాటలతో పలువురికి స్ఫూర్తి
» ప్రజా ఉద్యమానికి అక్షర ఆయుధాలు..
» వయసు మీదపడుతున్నా కుర్ర స్వరమే..
» మూఢాచారాలపై ఎక్కుపెట్టిన బాణం



ఖమ్మం సాంస్కృతికం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని చైతన్య పరచటం, పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను జాగ్రత్త పరచటం సాహిత్య ధ్యేయం.. బాధితుల్లో భరోసా నింపే విధంగా వాక్యాల ఆయుధాలను అందించటమే సాహిత్యకారుడి లక్షణం.. ఆ సూత్రానికి అక్షర సాక్ష్యం రౌతు రవి రచనలు. కవిత్వం, గేయం, తదితర ప్రక్రియల ద్వారా అభ్యుదయ భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నారు. దశాబ్దాల తన సాహిత్య కృషిలో భాగంగా పలు పుస్తకాలను వెలువరిచి ప్రజలకు అందించారు. సులభశైలిలో సామాన్య ప్రజలకు ఇట్టే అర్థం అయ్యేవిధంగా రచనలు సాగించటం రవి ప్రత్యేకత.. హైకూలు, మినీలు వంటి ప్రక్రియలలో కవిత్వాన్ని రచించి పాఠకుల ఆదరణ పొందారు. ముఖ్యంగా అభ్యుదయ గేయాలు, సామాజిక సందేశాన్నిచ్చే పాటలు, ప్రబోధాత్మక వీధి నాటికలు, అనేకం ప్రజల నోళ్లల్లో నానుతుంటాయి. పాటలను రాయటమే కాక స్వయంగా ఆలపించటం, కంజెర వంటి సంగీత పరికరాలను వాయించటంతో ఈయన రచనలు ప్రజల్లోకి సులువుగా వెళ్లేందుకు దోహద పడ్డాయి.

అవిశ్రాంతంగా...

ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసినప్పటికీ సాహిత్యంలో మాత్రం అవిశ్రాంతంగా కృషి చేస్తూనే ఉన్నారు. అక్షర పోరాటానికి అలుపులేదని నిరూపిస్తూనే ఉన్నారు. దేశ, ప్రపంచ వ్యాప్తంగా తలెత్తే సంఘటనల సమయంలో తనవంతుగా స్పందిస్తూ కవిత్వం, పాటలను రాస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. వయసు మీద పడుతున్నా తన గళానికి నిత్యయవ్వనమే అని చాటి చెపుతూ గేయాలను ఆలపిస్తున్నారు.

రైటర్స్ వర్క్‌షాప్‌తో...



ఖమ్మంలో నిర్వహించిన రైటర్స్ వర్క్‌షాప్ ఎతో రౌతు రవి రచనా పటిమ మరింత వెలుగులోకి వచ్చింది. సామాజిక సమస్యలపై ప్రజలను చైతన్య పరిచేందుకు నిర్వహించిన ఆ రైటర్స్ వర్క్‌షాప్‌నకు తన పాటలను సమకూర్చటంతో అప్పటి నుంచి కవిగా మంచి గుర్తింపు పొందాడు. తాను రాసిన కవితలతో వేకువపిట్ట అనే హైకూ సంకలనం, కలిసి పాడుదాం, చైతన్య తరంగాలు అనే పాటల సంకలనాలు, చెమట పూలతోట అనే కవిత్వ సంకలనాన్ని ఇటీవల వెలువరించటం విశేషం.

అక్షర దీపంలో ఉధృతంగా..

గతంలో కొనసాగిన సాక్షరతా ఉద్యమం సమయంలో రౌతు రవి మరికొందరు కవి మిత్రులతో కలిసి చురుగ్గా పాల్గొన్నారు. అక్షర దీపానికి నేను సైతం అంటూ వెలిగిన సాహిత్య దీపానికి అక్షర ఇంధనాన్ని సమకూర్చారు. చదువు నేర్చుకోవాలని, మూఢాచారాలు మానాలని, చెట్లను పెంచాలని, తదితర అనేక సందేశాత్మక గీతాలు ఈయనకు మంచి పేరు తెచ్చాయి. జిల్లా ఔన్నత్యాన్ని చాటుతూ ఈయన రాసిన పాట అప్పటి జిల్లా కలెక్టర్ ప్రశంసించటమే కాక క్యాసెట్‌గా రూపొందించారు. ఇంకా అనేక ప్రజా ఉద్యమాలకు తన వంతుగా పాటలను అందించారు.

విద్యార్థి దశలోనే..

విద్యార్థి దశలోనే రవికి సాహిత్య మక్కువ ఏర్పడింది. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో డి గ్రీ చదివే రోజుల్లో కళాశాలలో నిర్వహించే గోడపత్రికకు సాహిత్యాన్ని, అభ్యుదయ రచనలను అందించేవారు. క్రమంగా కవితలు రాయటం, పాటలను రాసి కంజెర సాయంతో తానే ట్యూన్ చేసుకొని పాడటం హాబీగా ఏర్పరుచుకున్నారు. తన గేయాలు అభ్యుదయ పదంలో ఉండటంతో తోటి విద్యార్థులతోపాటు ఇతర ప్రజలను ఆకర్షించేవి. ఆ విధంగా కవిత్వం, గేయం అనే రెండు పడవలపై సాగుతున్నారు.

మునిసిపల్ కార్పొరేషన్ ఏర్పాటుతో అభివృద్ధికి అధిక నిధులు

» ఆస్తుల విలువ పెరిగినా.. భారీ మొత్తంలో పన్నులు ఉండవు
» కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అభివృద్ధి కోసం నిధులు మంజూరు అవుతాయని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం కొత్తగూడెంలోని లక్ష్మీదేవిపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ నాయకులతో కలిసి మాట్లాడారు. కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, సహకరించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి మంత్రి కోమటరెడ్డి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్పొరేషన్ పరిధిలో ఆస్తుల విలువ అధికంగా పెరుగుతుందని, పన్నులు భారీ మొత్తంలో పెరగవని, ఎలాంటి అపోహలు వద్దని అన్నారు. పాల్వంచ మున్సిపాలిటీకి గత 29 ఏళ్ల నుంచి స్థానిక సంస్థల ఎన్నికలు జరగడం లేదని, కార్పొరేషన్ పరిధిలో పాల్వంచకు ఎన్నికలు జరిగే అవకాశం వచ్చిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు, బిక్కసాని నాగేశ్వరరావు, నాగ సీతారాములు, చింతలపూడి రాజశేఖర్, ఆళ్ల మురళీ, మాజీ జీడీసీచైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, యర్రంశెట్టి ముత్తయ్య, తూము చౌదరి, మహిళా జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, వై. శ్రీనివాసరెడ్డి, మండె వీరహనుమంతరావు, వాసిరెడ్డి మురళీ, చంద్రగిరి శ్రీనివాస్, వంగా వెంకట్, కాంగ్రెస్, సీపీఐ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వీరభద్రానికి జేఎన్‌టీయూ డాక్టరేట్



కొణిజర్ల, జనవరి7(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో జేఎన్‌టీయూ హైదరాబాద్ నుంచి కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన వడ్లమాని వీరభద్రం డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ అరుల్ డాల్టన్ పర్యవేక్షణలో 'యాన్ ఎఫిషియంట్ మెథడ్ ఫర్ కీ యాగ్రిగేట్ సెర్చబుల్ ఎన్క్రిప్షన్ ఫర్ గ్రూప్ డేటా షేరింగ్ వయా క్లౌడ్ స్టోరేజ్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనా గ్రంథానికి డాక్టరేట్ లభించిన్నట్లు తెలిపారు. వీరభద్రం బీటెక్ కాకతీయ విశ్వవిద్యాలయం కళాశాల నుంచి, ఎంటెక్ జేఎన్‌టీయూ కళాశాల నుంచి, ప్రస్తుతం పీహెచ్‌డీ జేఎన్‌టీయూ హైదరాబాద్ నుంచి పట్టభద్రులైనారు.

సింగరేణి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన భట్టి

రుద్రంపూర్, (సింగరేణి) జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితోపాటు థర్మల్ విద్యుత్, క్రిటికల్ మినరల్స్ మైనింగ్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి విస్తరించేలా ప్రణాళికలను రూపొదిస్తున్నామన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందిస్తూ సంస్థను అభివృద్ధిపథంలో నడిపించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 42వేలమంది ఉద్యోగులకు, కార్మికులందరికి క్యాలెండర్‌ను అందించనున్నట్లు సీఎండీ ఎన్. బలరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం కో ఆర్డినేషన్ సుభాని తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, సింగరేణి సీఎండి బలరాం

వైరాలో టీయూడబ్ల్యూజే ఐజేయూ ఖమ్మం జిల్లా మహాసభలు

వైరా, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నెలలో టీయూడబ్ల్యూజే ఐజేయూ ఖమ్మంజిల్లా మహాసభలు వైరాలో నిర్వహించేందుకు ఆ సంఘం జిల్లా కమిటీ నిర్ణయించింది. మంగళవారం వైరాలో జరిగిన జిల్లా కమిటీ మహాసభల సన్నాహక సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు వంటి సమస్యల పరిష్కారం కోసం తమ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మీడియా అకాడమీ చైర్మన్‌తో కలిసి ముఖ్యమంత్రి, మంత్రులతో మాట్లాడామని తెలిపారు. ఖమ్మం జిల్లా ఐజేయూ మహాసభలు వైరాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆసంఘం జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైరాలో జిల్లా మహాసభల నిర్వహణకు జిల్లా కమిటీ పూర్తిసహకారాన్ని అందిస్తుందని తెలిపారు. రాంనారాయణ, వెంకటేశ్వర్లును సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మోహిద్దీన్, నాయకుడు నర్వనేని వెంకట్రావ్, ఏపూరి రాజారావు, దాసరి శ్రీనివాసరావు, ఎం.బాబూరావు, ఎక్కిరాల శ్రీనివాసరావు, చెరుకుపల్లి శ్రీనివాసరావు, ఏలూరి వేణుగోపాల్, జనార్ధనాచారి, కల్యాణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంనారాయణ

తెలంగాణకే తలమానికంగా ఖమ్మం ఖిల్లా

» వేగంగా రోప్‌వే నిర్మాణ పనులు
» పర్యాటకులకు కనువిందు చేసేలా హంగులు
» ఖమ్మం పర్యాటక గుమ్మం కావాలి
» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
» హైదరాబాదులోని టూరిజం కార్యాలయంలో సమీక్ష

ఖమ్మం, జనవరి 7(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం ఖిల్లా తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా నిలిపేలా పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పర్యాటకరంగానికి ఖమ్మం గుమ్మం కావాలని, ఇదే తన లక్ష్యమన్నారు. హైదరాబాదులో మంగళవారం టూరిజం కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మంజిల్లా పర్యాటక అభివృద్ధిపై మంత్రి తుమ్మల సమీక్షించారు. ఖమ్మం ఖిల్లాతోపాటు భక్తరామదాసు ధ్యానమందిరం, బౌద్దస్థూపం తదితర చోట్ల చేపట్టబోతున్న పర్యాటక పనుల పురోగతిపై తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరి స్మితాసబర్వాల్, ఎండీ ప్రకాష్‌రెడ్డి తదితరులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఖమ్మం ఖిల్లాపై సందర్శకులు నిత్యం పర్యటించేలా రోప్‌వే నిర్మాణం చేపట్టామని, ఈ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. రోప్‌వే బ్రిడ్జి లోయర్‌పాయింట్ లకారం పార్కువద్ద ఏర్పాటుచేస్తే బాగుంటుందని, సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. లేనిపక్షంలో పాత మునిసిపాలిటీ కార్యాలయం నుంచి ఏర్పాటుచేయాలని సూచించారు. పనులు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సందర్శకుల వాహనాలకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి అక్కడినుంచి బ్యాటరీ వాహనాల్లో రోప్‌వేకు సందర్శకులను తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మంను టూరిజం హబ్‌గా మార్చే దిశగా పనులు చేపట్టాలన్నారు. పర్యాటకులు పెద్దసంఖ్యలో వచ్చేలా జిల్లాను పర్యాటక గుమ్మంగా తీర్చిదిద్దేందుకు ఎక్కువ పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాలన్నారు. ఇప్పటికే భద్రాచలం దక్షిణ అయోధ్యగా ఆధ్యాత్మిక శోభకు నిలయంగా ఉందన్నారు. కిన్నెరసాని ప్రాజెక్టు వద్ద పర్యాటక అభివృద్ధి చేపట్టాలని, మున్నేరుపై తీగల వంతెన నిర్మాణం జిల్లాకు మణిహారంగా నిలుస్తుందన్నారు. ఖమ్మం ఖిల్లాపై రోప్‌వేతో పాటు అమ్యూజ్‌మెంట్ పార్కులు, మినీథియేటర్, రెస్టారెంట్, షాపింగ్ మాల్స్, వాటర్‌ఫౌంటేన్లు, వ్యూపాయింట్ అందమైన లైటింగ్, సంప్రదాయ వంటకాలు ఉండేలా చూడాలన్నారు. ఖిల్లా అభివృద్ధి పనులపై మంత్రి తుమ్మల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు పలు ఆదేశాలు ఇచ్చారు.

నిధుల కేటాయింపు

ఖమ్మంఖిల్లా రోప్‌వేతో పాటు జిల్లాలోని ఇతర పర్యాటక అభివృద్ధి పనులుకు నిధులు కేటాయిస్తామని, పర్యాటక పనులకు భూములు అప్పగించాలని రెవన్యూ అధికారులకు మంత్రితుమ్మల సూచించారు. ఖమ్మంఖిల్లాకు మునిసపిల్ కార్పొరేషన్ నుంచి నిధులు మంజూరు చేయాలని, అలాగే నియోజకవర్గ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను కూడా ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.

జిల్లా పర్యాటక ముఖచిత్రంలో ఎర్రుపాలెం

అధ్యాత్మికం, ఆహ్లాదం ఉండేలా అభివృద్ధి
అడవులు, చెరువులను కాపాడుకోవాలి
సంక్రాంతి తర్వాత ఇందిరమ్మ ఇళ్లు
డిప్యుటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



ఔషధ మూలికల గురించి ఉపముఖ్యమంత్రికి వివరిస్తున్న అటవీ అధికారులు

ఎర్రుపాలెం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పర్యాటక ముఖచిత్రంలో ఎర్రుపాలెం మండలం ఉండబోతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఆధ్యాత్మికం, ఆహ్లాదం అంటే ఈ ప్రాంతం గుర్తొచ్చేలా అభివృద్ధి జరగబోతుందని పేర్కొన్నారు. ఎర్రుపాలెం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పర్యటించిన భట్టి రూ.26.30కోట్లతో ఎర్రుపాలెం, వెంకటాపురం, జమలాపురం గ్రామాల్లో రహదారులకు, అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యాటక అభివృద్ధికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు, చెరువులు మనకు విలువైన ఆస్తులని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రమణీయమైన అటవీ ప్రకతి అందాలను మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేసి పర్యాటకులకు కనువిందు చేసేలా తీర్చిదిద్దుతామన్నారు. జమలాపురం ఆలయానికి భక్తుల సంఖ్య పెరుగుతున్నందున కాటేజీలు, క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బుచ్చిరెడ్డిపాలెంలో నిద్రమ్మ చెరువును టూరిజం పాయింట్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. అడవులను ధ్వంసం చేయకుండా ప్రకృతిని ఆస్వాదించాలన్నారు. అనంతరం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకం ద్వారా రూ.1.48కోట్లతో మీనవోలు, పెగళ్లపాడు, ఎర్రుపాలెం, రామచంద్రాపురం, తెల్లపాలెం, కండ్రిక, బంజర, జమలాపురం, నారాయణపురం, సత్యనారాయణపురం గ్రామల్లో సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ విక్రమ్ సింగ్, ఫారెస్టు చీఫ్ కన్జర్వేటర్ బీమానాయక్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీవో నర్సింహారావు, ఎఫ్‌డీవో మంజుల, తహసీల్దార్ ఉషాశారద, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడ దుర్గాప్రసాద్, మండల

బలరామావతారంలో జానకిరాముడు

● ఘనంగా వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు



భద్రాచలం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ సీతారామచంద్రస్వామి బలరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి బలరామావతారాన్ని అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణ, బాజభజంత్రీల నడుమ స్వామివారిని మిథిలా స్టేడియ ప్రాంగణంలోని అధ్యయనోత్సవ వేదిక వద్దకు తీసుకొచ్చారు. అక్కడ విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించి నివేదన చేశారు. అనంతరం స్వామివారిని తిరువీధి సేవకు తీసుకెళ్లారు. నేడు స్వామివారు శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

భద్రాద్రికి ముక్కోటి శోభ



సిద్ధమైన ఉత్తర ద్వారం

భద్రాచలం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముక్కోటి మహోత్సవాలు కీలక ఘట్టానికి చేరుకున్నాయి. గురువారం సాయంత్రం గోదావరిలో శ్రీ సీతారామచంద్రస్వామికి హంసాలంకృత తెప్పపై తెప్పోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేయగా తెప్ప ట్రయల్‌రన్ సైతం విజయవంగా నిర్వహించారు. శుక్రవారం ముక్కోటిని పురస్కరించుకొని ఉత్తరద్వారంలో శ్రీ సీతారామచంద్రస్వామి వేకువజామున భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. ఇప్పటికే ఉత్తరద్వారానికి రంగులు వేసి విద్యుద్దీపాలంకరణ చేశారు. గురువారం రాత్రి వివిధ రకాల పుష్పాలతో ఉత్తర ద్వారాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దనున్నారు. దేవస్థానం ఇప్పటికే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఉత్తరద్వార దర్శన టికెట్లను విక్రయిస్తోంది.

స్వాగత ద్వారాలు, చాందినీ వస్త్రాలంకరణ

భద్రాద్రిలో ఎటు చూసినా స్వాగత ద్వారాలు, చాందినీ వస్త్రాలంకరణ, విద్యుద్దీపాలతో రామాలయ పరిసరాలు పండుగ కళను సంతరించుకున్నాయి. ఏ నోట విన్నా శ్రీరామ నామస్మరణే వినిపిస్తోంది. మిథిలా స్టేడియంలోని వేదిక వద్ద కళాకారులు రాత్రి సమయాల్లో భక్తరామదాసు, తూము నరసింహదాసు కీర్తనలను ఆలపిస్తున్నారు. అలాగే సంప్రదాయ శాస్త్రీయ నృత్యాలు, భక్తిరస నాటకాల ప్రదర్శనతో భద్రాద్రి సందడిగా మారింది.



సంప్రదాయ సెలఏరు

» ముక్కోటి వేళ భద్రాచలంలో ఏజెన్సీ పర్యాటక పండుగ

భద్రాచలం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): 'ఏరు' అంటే కోయ బాషలో 'నీరు' అని అర్థం. నీటికి, అడవికి, గిరిజనులకు విడదీయరాని బంధం ఉంటుంది. ఏజెన్సీలో దశాబ్ధాల కాలంగా అడవి తల్లినే నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీలు ప్రత్యేక సంస్కృతి, ఆచార వ్యవహారాలు, వేషధారణ, ఆభరణాలు ధరించడంలో ఓ ప్రత్యేక శైలి కలిగి ఉంటారు. కోయ తెగ వారికి 'వేట' అత్యంత ప్రీతికరమైంది. ఈ నేపథ్యంలో ఆదివాసీల గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే ప్రయత్నం 'ఏరు' కార్యక్రమం ద్వారా చేస్తున్నారు. ఇందుకోసం భద్రాచలంలోని గిరిజన మ్యూజియంను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పూర్తిగా ఏజెన్సీ వాతావరణం ఉట్టిపడేలా ఏర్పాట్లు చేశారు. వన్యప్రాణుల గురించి తెలుసుకునేందుకు కిన్నెరసాని డీర్‌పార్క్, కెనాల్ కొరాకిల్ రైడ్, డ్యామ్ బోటింగ్ పచ్చని దీవిపాల మధ్య సాగే ప్రయాణం, పర్యాటకులకు కన్నులవిందు చేయనుంది. ఇక 'ఏరు' పండుగ సందర్భంగా గోదావరిలో బోటింగ్‌ను సైతం నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా ఈ ఐదు బోట్లకు 'ఏరు.. ది రివర్ ఫెస్టివల్' పేరిట రంగులతో అలంకరించారు.

వెదురు అల్లికలు, ఆహార స్టాల్స్

గోదావరి తీరంలో వెదురు అల్లికలు, సంప్రదాయ గిరిజన ఆహార వంటకాలు పర్యాటకులకు రుచి చూపించబోతున్నారు. ఇప్పపువ్వు, కరక్కాయ, తేనె, వెదురు అల్లికలు ఇతరత్రా వాటితో సుమారు 50 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి.



'ఏరు ది రివర్‌ఫెస్టివల్' పేరిట బోట్లు సిద్ధం

సాంస్కృతిక ప్రదర్శనలు

ఏజెన్సీ జిల్లా అయిన భద్రాద్రి కొత్తగూడెం అంటేనే గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను నిలయమైన ప్రాంతం.. ఇక్కడ సంప్రదాయ గిరిజన నృత్యాలకు పెట్టింది పేరు. వీటిని గోదావరి తీరంలో ప్రత్యేక వైదికపై భక్తులు, పర్యాటకులు వీక్షించేలా ఏర్పాటు చేయనున్నారు.



భద్రాచలంలో గోదావరి తీరంలో సెల్ఫీ పాయింట్



గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న వేదిక

క్రైం సమాచారం

తండ్రి మందలించాడని ఆటోడ్రైవర్ ఆత్మహత్య

మణుగూరుటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడని మండల పరిధిలోని అశోక్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ తెడ్డు మహేష్ (20) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసు తెలిపిన వివరాలు.. మణుగూరుకు చెందిన తెడ్డు శ్రీశైలం కుమారుడైన మహేష్ అవివాహితుడు. ఏడాది కాలంగా కొత్తగూడెంలో ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల ఇతనిపై మణుగూరులో ఓ చోరీ కేసు కూడా నమోదు అయింది. మణుగూరు కోర్టుకు బుధవారం హాజరు కావాల్సి ఉంది. ఈ క్రమంలో రెండు రోజుల ముందుగా కొత్తగూడెం నుంచి మణుగూరుకు చేరుకున్నాడు. మహేష్ దగ్గర సెల్ లేకపోవడంతో ఏమైందని తండ్రి శ్రీశైలం మందలించడంతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంటినుంచి బయటికి వచ్చాడు. మణుగూరు డిగ్రీ కాలేజిలో ఆవరణలో చెట్టుకు ఉరివేసుకుని విగత జీవిగా కన్పించాడు. గమనించిన స్థానికులు తండ్రి శ్రీశైలానికి సమాచారం ఇచ్చారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు దర్యాప్తు చేసి చేస్తున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

కల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పడమట లోకవరం గ్రామంలో గల్లంతైన యువకుడి మృతదేహం మంగళవారం సాగర్ కాల్వలో లభ్యమైంది. ఆదివారం తన స్నేహితులతో కలిసి లోకవరం గ్రామ సమీపాన సాగర్ కాల్వ వద్దకు సెల్ఫీ దిగేందుకు వెళ్లిన పరిమి శివ ప్రమాద వశాత్తు కాల్వలో పడి గల్లంతైన విషయం విదితమే. రెండు రోజులుగా శివ మృతదేహం కోసం రెస్క్యూటీం, గ్రామస్థులు గాలించిన ఫలితం లేక పోయింది. దీంతో మంగళవారం పడమట లోకవరం- పుల్లయ్యబంజర గ్రామాల మధ్య సాగర్ కాల్వలో శివ మృతదేహం నీటిపై తెలియడింది. గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా వారి సమక్షంలో శివ మృతదేహాన్ని బయటకు వెలికి తీశారు. తల్లి విజయ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పెనుబల్లి ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శివ (ఫైల్)

చెల్లని చెక్కు కేసులో ఆరునెలల జైలు

మణుగూరు టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో ఓ వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ మణుగూరు కోర్టు న్యాయాధికారి సూరిరెడ్డి తీర్పునిచ్చారు. కేసుకు సంబంధించిన వివరాలు.. ఇలా ఉన్నాయి. 2020లో మణుగూరుకు చెందిన కంకటకాల నాగ వెంకట శ్రీనివాస్ బావి కూనవరం గ్రామానికి చెందిన మోహిద్ ముక్తాజాకు రూ.3లక్షల అప్పు ఇచ్చాడు. ఇందుకు సంబంధించి సూరిటీగా ముక్తాజా శ్రీనివాస్‌కు చెక్ ఇచ్చాడు. ఈ చెక్ శ్రీనివాస్ బ్యాంకు లో జమ చేయగా బౌన్స్ అయింది. బాధితుడు శ్రీనివాస్ కోర్టులో తన న్యాయవాది ద్వారా సివిల్ కేసు పెట్టాడు.

సాక్షాలను పరిశీలించిన కోర్టు న్యాయాధికారి ముక్తాజాకు రూ.3లక్షల జరిమానా, ఆరునెలల జైలు శిక్ష విధిస్తూ తీ ర్పు ఇచ్చారు. నగదు కట్టని పక్షంలో మరో నెల కాలం అదనంగా జైలు శిక్ష ఉంటుందని తీర్పు ఇచ్చారు. ఫిర్యాదు తరుపున న్యాయ వాదులు ఎస్‌వీ రమణా రెడ్డి, బద్దం శ్రీనివాసరెడ్డి, గురుకృష్ణ వాదించారు.

తహసీల్దార్ల ఎదుట 150మంది బైండోవర్

అశ్వారావుపేట రూరల్/దమ్మపేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పేరుతో కోడి పందేలు, పేకాట ఆటలు ఆడినా, నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ యయాతి రాజు హెచ్చరించారు. గడిచిన మూడేళ్లలో కోడిపందేలు, పేకాటకు సంబంధించి కేసులు నమోదు అయిన వివిధ గ్రామాలకు చెందిన వారికి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన 70మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దారు ఎదుట హాజరుపరిచారు. ఎస్‌ఐ మాట్లాడుతూ పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డయల్ 100 లేదా, 8712682062కి ఫోన్ చేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి గోప్యంగా ఉంచుతామని, జూదం నిరోధానికి సహకరించాలని ఎస్‌ఐ కోరారు.

దమ్మపేట(ఆంధ్రజ్యోతి): కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సాయి కిషోర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గత మూడేళ్లలో కోడి పందేలు, పేకాట కేసులలో నింధితులుగా ఉన్న 80 మందికి ఎస్‌ఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. కోడికత్తులు కట్టేవారికి హెచ్చరికలు చేశారు. అనంతరం తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు.

ఖమ్మం నగరంలో రెండు ఇళ్లలో చోరీ

ఖమ్మంక్రైం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): నగరంలో రెండుచోట్ల తాళం వేసి ఉన్న ఇళ్లలో మంగళవారం తెల్లవారుజామున చోరీలు జరిగాయి. నగరంలోని మామిళ్లగూడెంలో నివాసం ఉంటున్న వనం బాబు ముదిగొండ సొసైటీ డైరెక్టర్‌గా ఉన్నాడు. ఆయన గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు మొదటి అంతస్తులో నివాసం ఉండడంతోపటు కుటుంబసభ్యులతో కలిసి మొదటి అంతస్తులో సోమవారం రాత్రి నిద్రించేందుకు వెళ్లారు మంగళవారం ఉదయం కిందికి వచ్చిచూడగా ఇంటి తాళాలు పగులొట్టి ఉన్నది చూశారు. ఇంటిలోకి వెళ్లిచూడగా బీరువాలోని 12తులాల బంగారం, కొన్ని వెండి వస్తువులు చోరికి గురయ్యాయి. దీంతో బాధితుడు ఖమ్మంటుటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేయగా వారు సంఘటన స్థలానికిచేరి వివరాలు సేకరించి కేసునమోదుచేశారు. అదే విధంగా బ్యాంకుకాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డు పోస్టుమాస్టర్ దొడ్డా నాగేశ్వరరావు ఇంటిలోకూడా గుర్తుతెలియని వారు తాలం పగులగొట్టి చోరికి పాల్పడ్డారు. నాగేశ్వరరావు తన కుటుంబంతో కలిసి హైదరాబాదులోని తన కుమారుడి వద్దకు ఇటీవల వెళ్లాడు. తిరిగి మంగళవారం వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఇంటిలోని 185గ్రాముల బంగారం 20 తులాలవెండి చోరికి గురైనట్టు గమనించారు. దీంతో బాధితులు టుటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేయగా వారుచకేసు నమోదుచేసి క్లూస్‌టీం ద్వారా వివరాలు సేకరించారు. అనంతరం ఈఘటనలపై సమీపంలోని సీసీ కెమేరాల ద్వారా వివరాలు సేరిస్తున్నట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు.

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఖమ్మంక్రైం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పరిధిలోని పాండురంగాపురం పరిధిలోని ఓ పాత రైస్‌మిల్లులో అక్రమంగా నిలవ చేసిన 600 బస్తాల రేషన్‌బియ్యాన్ని మంగళవారం సాయంత్రం ఖానాపురంహవేలి పోలీసులు పట్టుకుని సీజ్‌చేశారు సీఐ భానుప్రకాష్ కథనం ప్రకారం ఓమిల్లులో 600 బస్తాల (సుమారు 300 క్వింటాళ్ల)బియ్యంను పాండురంగాపురానికి చెందిన నజీర్ అనే వ్యక్తి మిల్లును అద్దెకు తీసుకుని అక్రమంగా నిలవచేశారని సమాచారం రావడంతో సీఐ భానుప్రకాష్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. దీంతో అక్కడ 600బస్తాలలో రేషన్‌బియ్యం నిలవ చేసి ఉండడంతో వాటిని సీజ్‌చేసి సివిల్‌సప్లయ్ అధికారులు సమాచారం అందించి వారికి అప్పగించారు. అనంతరం నజీర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. అక్రమ వ్యాపారం నిర్వహిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.


రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఐదేళ్ల అనంతరం కుటుంబ సభ్యుల చెంతకు ..

ఖానాపురంహవేలి జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల అనంతరం ఓ వ్యక్తిని కుటుంబ సభ్యుల అప్పగించిన అన్నం ఫౌండేషన్. కరోనా మొదటి దశ 2020లో మతిస్థిమితం కోల్పోయి రోడ్ల వెంట తిరుగుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని నగరంలోని అన్నం ఫౌండేషన్‌కు తరలించారు. వైద్య సేవల అనంతరం మూడు రోజుల క్రితం మామూలు స్థితికి వచ్చి వివరాలు తెలిపాడు. తనది సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం కాసింపూర్ అని, పేరు తుల్జారామ్ తెలిపినట్లు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. ఆ వివరాల ప్రకారం చిరాగ్‌పల్లి పోలీసుల సహకారంతో మంగళవారం పోలీసుల సమక్షంలో భార్యకు అప్పగించారు. తప్పిపోయిన వ్యక్తిని చేరదీసిన అన్నంఫౌండేషన్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

2.8 కేజీల గంజాయి పట్టివేత

మణుగూరుటౌన్ జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సమితి సింగారం లో మంగళవారం 2.8 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ మేడ ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన బండారి స్వరూప, గణపవరపు అబిరామ్, చల్లారమేష్, వాసీం అక్రమ్‌లు కలసి స్వరూప ఇంటిలో గంజాయిని విక్రయి స్తున్నారన్న సమాచారం మేరకు స్వరూప ఇల్లు సోదా చేయగా అక్కడ 2.8 కేజీల గంజాయి లభ్యమైంది, బండారి స్వరూప, చల్లారమేష్, వాసిం అక్రమ్‌లను అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. గణవరపు అభిరాం పరారిలో ఉన్నాడన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని చింతూరులో నగేష్ అనే వ్యక్తి వద్ద ఈ గంజాయిని నిందితులు కొనుగోలు చేశారన్నారు. ఈ గంజాయి వ్యాపారంలో సంబంధం ఉన్న అక్రమ్‌కు చెందిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వైరా రిజర్వాయర్‌లో తగ్గిన నీటిమట్టం

సాగర్‌జలాల విడుదల కోసం రైతుల విజ్ఞప్తి

భగీరథ నీటి సరఫరాకు కష్టమే..

వైరా, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా మంగళవారం నాటికి 13.3అడుగులకు తగ్గిపోయింది. ఐదు అడుగుల నీటిమట్టం తగ్గడంతో రబీలో పంటల సాగుతోపాటు మిషన్ భగీరథ పథకం నుంచి తాగునీటి సరఫరాపై కూడా దీని ప్రభావం పడనుంది. ఈ పరిస్థితుల్లో రిజర్వాయర్‌కు సాగర్‌జలాలు సరఫరా చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

రబీ సాగు కోసం..

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 23వరకు రబీ సాగుకు షెడ్యూల్ ప్రకటించింది. వారబందీ విధానంలో నీటి సరఫరా జరుగనుంది. దానిలో భాగంగానే వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల ఆయకట్టుకు మార్చి చివరి వరకు నీటి సరఫరా చేయాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన నీటిపారుదల శాఖ అధికారులు, ఆయకట్టు రైతులతో జరిగిన సమావేశంలో నిర్ణయం చేశారు. ప్రభుత్వం మాత్రం రబీలో ఏప్రిల్ 23వరకు ఆన్‌అండ్ ఆఫ్ పద్ధతిలో నీటి సరఫరా చేస్తామని ప్రకటించింది. ఇప్పటికే రబీకి సంబంధించి దాదాపు 2500పైచిలుకు ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశారు. అది కాకుండా విత్తనం మొక్కజొన్న కూడా వందలాది ఎకరాల్లో రైతులు వేశారు. చెరకు సాగు కూడా చేపట్టారు. దాదాపు వెయ్యి ఎకరాలకుపైగా మిర్చి సాగులో ఉంది. ఇకపోతే కుడి. ఎడమకాల్వల కింద 10నుంచి 15వేల ఎకరాల్లో రబీ వరిని సాగుచేసేందుకు రైతులు వరినార్లు పోశారు. ఏర్లు, వాగులు, కరెంట్ మోటర్ల ఆధారంగా ఇప్పటికే దాచాపురం, గరికపాడు, ఖానాపురం, ముసలిమడుగు, గొల్లెనపాడు తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి వేశారు.

నీటిమట్టం తగ్గడంతో ఆందోళన..

ఈ పరిస్థితుల్లో రిజర్వాయర్ నీటిమట్టం 13.3అడుగులకు తగ్గిపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళనగా ఉన్నారు. ఖరీఫ్‌లో సాగర్ జలాలతో నిమిత్తం లేకుండానే వర్షాధారంగానే రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమకాల్వల ద్వారా పంటలకు నీటి సరఫరా చేశారు. అయితే ఇప్పుడు నీటిమట్టం తగ్గిపోతున్నందున సాగర్ జలాల అవసరం ఏర్పడింది. ఎన్నెస్పీ 21ఎంటీసీ పైనున్న ఎస్కేప్ లాకుల నుంచి వైరా రిజర్వాయర్‌కు సాగర్‌నీరు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

అనేకమంది రైతులు ఈ రబీలో దమ్ములు చేసి నేరుగా వరి విత్తనాలు చల్లుకుంటున్నారు. కొంతమంది రైతులు వరినారుమళ్లు పోసుకున్నారు. నారుమళ్లు ఏపుగా ఎదిగే దశలో ఉన్నాయి. అందువలన సాగర్‌జలాలతో వైరా రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపి రబీలో రైతులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అంతేకాకుండా రిజర్వాయర్‌లో కనిష్టంగా 14అడుగుల నీటిమట్టాన్ని మిషన్ భగీరథ తాగునీఌ అవసరాల కోసం నిల్వ ఉంచాలనే నిబంధన కూడా ఉంది. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా ఎలాంటి నిమాంస లేకుండా సాగర్‌జలాలతో రిజర్వాయర్‌ను నింపాలని రైతులు కోరుతున్నారు.


వైరా రిజర్వాయర్

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని

బోనకల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై రాజీలేని పోరును సాగిస్తామని, ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడమే తమ పార్టీ ధ్యేయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన ఆ పార్టీ మండల సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాలు దేశానికే ప్రమాదకరమన్నారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొడతామని తెలిపారు. దేశంలో జమిలి ఎన్నికల విధానం సాధ్యం కాదన్నారు. పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు గానూ కాంగ్రెస్ ప్రభుత్వం హడావిడిగా రైతు భరోసాను ప్రకటించిందని ఆరోపించారు. పథకాలను పూర్తిగా అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆరు నెలలుగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న డిమాండ్ తమ పార్టీ పోరాటాలను నిర్వహిస్తుందన్నారు. అనంతరం సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, నాయకులు దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, తుళ్లూరి రమేష్, చింతలచెర్వు కోటేశ్వరరావు, చిట్టిమోదు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

హిందూ శ్మశాన వాటిక స్థలం పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మధిరటౌన్, జనవరి7(ఆంధ్రజ్యోతి): మధి ర పట్టణంలో ఆక్రమణకు గురైన హిందూ శ్మశాన వాటిక స్థలాన్ని జిల్లా సర్వేయర్ పి.వెంకట్రావు మంగళవారం పరిశీలించారు. రూ.3 కోట్ల విలువ చేసే 2,783 గజాల హిందూ శ్మశానవాటిక తో పాటు ప్రభుత్వ డొంకను కొందరు ఆక్రమించి ఇటీవల తప్పు డు ధృవపత్రాలతో కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయాన్ని 'ఆంధ్రజ్యో తి' ప్రచురించింది. విషయం కాస్తా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి పోవడం తో ఆయన జిల్లా అధికారులను ఆదేశించడంతో జిల్లా సర్వేయర్ నక్షాతో వచ్చి ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. బుధవారం శ్మశానవాటిక స్థలాన్ని సర్వేచేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ఉషారాణి, ఆర్‌ఐ భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

కాంగ్రెస్.. రైతుల ప్రభుత్వం

డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల, మేయర్ నీరజ

కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో భట్టి, తుమ్మల, పొంగులేటి చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతుల పక్షాన పనిచేస్తోందని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందన్నారు. రూ.2లక్షల రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించిదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పలుగా మార్చిందని, అయినా ఎంతో ఆర్థిక క్రమశిక్షణతో కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతాయుతంగా పనిచేస్తూ రైతు రుణమాఫీ, రైతు బీమా, రైతు భరోసా పథకాలను అమలు చేస్తోందని, మహిళలకు ఆరు గ్యారెంటీ పథకాలను, విద్యార్థులకు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి ఊరూరా ప్రచారం చేయాలని కోరారు. ఉప మేయర్ పాతిమా జోహరా, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, పల్లెబోయిన చంద్రంభారతి, లకావత్ సైదులునాయక్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బిడ్డతో సహా తల్లి అదృశ్యం

కరకగూడెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కరకగూడెం మండలంలో ఏడాది నిండని బిడ్డతో తల్లి అదృశ్యం సంఘటనపై ఆమె తండ్రి మంగళవారం కరకగూడెం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్‌ఐ రాజేందర్ తెలిపిన వివరాలు.. కరకగూడెం గ్రామానికి చెందిన పోలెబోయిన శేఖర్ అదే గ్రామానికి చెందిన గొగ్గలి లక్ష్మీ ప్రసన్న అనే యువతిని పెళ్లి చేసుకుంటానని మోసం చేయడంతో పెద్దల సమక్షంలో 6నెలల క్రితం కరకగూడెంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో పెళ్లిచేశారు. అనంతరం అత్తవారి ఇంటి వద్ద బిడ్డకు జన్మనించిన లక్ష్మీ ప్రసన్న అత్తవారి ఇంటి వద్ద చిన్నచిన్న గొడవలు జరగడంతో ఏడాది గడవని బిడ్డతో జనవరి 5న అదృశ్యం అయినట్లు తండ్రి గొగ్గలి రవి మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బియ్యం బాగాలేకపోతే మార్చుకోండి

● అదనపు కలెక్టర్ శ్రీజ ●పెద్దగోపతి పాఠశాలల తనిఖీ ●బియ్యంలో పురుగులు కథనంపై పరిశీలన

కొణిజర్ల, జనవరి7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగోపతి జిల్లాపరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్నం భోజనం కోసం పంపించే బియ్యంలో పురుగులు, తుట్టులు వచ్చాయన్న విషయంపై మంగళవారం అదనపు కలెక్టర్ శ్రీజ పాఠశాలను సందర్శించారు. మండల విద్యాశాఖాధికారితో, ఆ యా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులుతో బియ్యం గురించి మాట్లాడి పరిశీలించారు. బియ్యం ఎక్కడ నుంచి వస్తున్నాయి, పురుగులు వచ్చాయా అని తెలుసుకున్నారు. వైరా పౌరసరఫరా గోదాం నుంచి వస్తాయని ఎంఈవో వివరించారు. బాలికలతో మాట్లాడారు. భోజనం, మెనూ, వసతులు గురించి హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడారు. బియ్యంలో పురుగులు ఎప్పుడూ రాలేదని ఇప్పుడే వచ్చాయని ఉపాధ్యాయులు తెలిపారు. బియ్యం సరఫరా చేసే గోదాములో కూడ బియ్యం మంచిగానే ఉన్నట్లు తెలిసింది. అయితే బియ్యం పాఠశాలలో నిల్వ చేసే క్రమంలో ఏమైన చేరి ఉంటాయా అని ఆరా తీస్తున్నారు. బియ్యం బాగా లేకపోతే మార్చుకోవాలని అదనపు కలెక్టర్ సూచించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఎంఈవో అబ్రహం పాల్గొన్నారు. అలాగే మండలంలోని సింగరాయాపలెం ఉన్నత పాఠశాలను డీఈవో సోమశేఖరశర్మ పరిశీలించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

అక్రమ బ్లాస్టింగ్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు

తిరుమలాయపాలెం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం గ్రామంలో అక్రమంగా ప్రభుత్వ భూమి లో మట్టి తవ్వకాలు చేస్తూ బ్లాస్టింగ్ చేస్తున్న స్థావరాలపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. తిరుమలాయపాలెంలో సర్వే నెంబరు 26, 27 ప్రభుత్వ భూమిలో తిరుమలాయపాలేనికి చెందిన మాచర్ల నాగరాజు అనే వ్యకి కుటుంబసభ్యులకు ప్రభుత్వం భూమి కేటాయించగా పక్కనే ఉన్న మరో కొంత ప్రభుత్వ భూమిలో ఎటువంటి అనుమతి లేకుండా 15రోజుల నుంచి అక్రమంగా మట్టి విక్రయిస్తున్నాడు. అలాగే ఆ స్థలంలో ఉన్న పెద్దపెద్ద రాళ్లను తొలగించేందుకు బ్లాస్టింగ్ చేపడుతున్నాడు. 15రోజుల నుంచి జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. రైతులు రెవెన్యూ అధికారులుకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదు. దీంతో టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం అందించారు. ఏసీపీ రవి ఆదేశాలతో మంగళవారం సీఐ రామకృష్ణ, ఏఎస్‌ఐ శ్రీనివాసచారి, హెచ్‌సీ హరి ఆధ్వర్యంలో అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తున్న తవ్వకాలపై దాడులు చేశారు. పొక్లెయిన్‌తో పాటు బ్లాస్టింగ్‌కు వినియోగించిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముదిగొండకు చెందిన దేరంగి శ్రీను, జాలాది రాంబాబులను అదుపులోకి తీసుకుని తిరుమలాయపాలెం పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.


అక్రమ బ్లాస్టింగ్ జరుగుతున్న ప్రదేశం వద్ద టాస్క్‌ఫోర్స్ అధికారుల



ఆంధ్రజ్యోతి KHAMMAM CITY

బుధవారం 8 జనవరి 2025

● ఖమ్మం ● రఘునాథపాలెం
● ఖమ్మం రూరల్
● తిరుమలాయపాలెం
● కూసుమంచి
● నేలకొండపల్లి ● కామేపల్లి

ఖమ్మం సిటీ

ZONE 8

జెన్‌కో ఏఈగా ఖానాపురం వాసి



ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం 6వడివిజన్ ప్రశాంతినగర్‌కు చెందిన కుర్రా సతీష్ పాల్వంచలోని టీజీ జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీరిగ్‌గా ఎంపికైనాడు. మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో జెన్‌కోఅధికారులు నియామక పత్రం అందించారు. 2024 జూన్‌లో జరిగిన జెన్‌కో పరీక్షల్లో ప్రతిభ కనపరిచాడు. ఈనెల3న విడుదలైన ఫలితాల్లో ఎంపికయ్యాడు. తండ్రి కోటేశ్వరరావు గ్రానైట్ క్వారీలలో ట్రాక్టర్ నడుపుకుంటూ సతీష్‌ను చదించాడు.

మంత్రి పొంగులేటిని కలిసిన పాలేరు నేతలు



కూసుమంచి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రెవిన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని పాలేరు నియోజకవర్గ నాయకులు హైదరాబాద్‌లో క్యాంపు కార్యాలయంలో కలిశారు. పలుఅభివృద్ధి పనులు మంజూరీ చేయాలని కోరారు.కూసుమంచి మండలం మునిగేపల్లి నుంచి కట్టకూరు వరకు, వెంకట్రాంపురం నుంచి వీరన్నస్వామివరకు బీటీనిర్మాణానికి నిధులు మంజూరీ చేయాలని కోరారు. ఖమ్మంరూరల్ మండలం నాయుడిపేట సర్కిల్ నుంచి కరుణగిరి మున్నేరు వంతెన వరకు, కరుణగిరి బైపాస్ నుంచి కేంద్రీయ విద్యాలయం వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్‌తో రహదారులు మంజూరీ చేయాలని కోరారు. స్పందించిన మంత్రి పొంగులేటి వెంటనే ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బండి జగదీష్, అంబటి సుబ్బారావు, హఫీజుద్దీన్, రామ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఒకేరోజు మూడు దుకాణాల్లో చోరీ

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): లకారం ట్యాంక్‌బండ్ దుకాణాలపై వరుస చోరీలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి ట్యాంక్‌బండ్‌పై ఎస్.కె. పాషా,ఎస్.కే.గౌస్య, ఎస్.కె.యాకూబ్ దుకాణాల తాళాలు పగలగొట్టి కూల్‌డ్రింక్స్, ఆహార పదార్థాలు తీసుకెళ్లారు. లకారం ట్యాంక్‌బండ్,చెరువుబజారు రోడ్డు మధ్యలో ఖాళీ ప్రదేశంలో రాత్రిళ్లు కొంతమంది మద్యం, గంజాయి సేవించి అర్ధరాత్రి ఇటువంటి చోరీలకు పాల్పడుతున్నట్లు ఆరోపిస్తున్నారు. కాగా ఇక్కడి సీసీ కెమెరాలు పని చేయకపోవడం గమనార్హం.

పని తీరు మార్చుకోవాలి

- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య
- పారిశుధ్య పనులు తనిఖీ
- అందుబాటులో లేని ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు



అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లాకు సూచనలు చేస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): పని తీరు మార్చుకోవాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య హెచ్చరించారు.మంగళవారం ఉదయం కమిషనర్ అభిషేక్ అగస్త్య 21, 22, 45, 50 డివిజన్లలో తనిఖీ చేశారు. కమిషనర్ పరిశీలన సమయంలో శానటరి ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు లేక పోవటాన్ని గమనించారు. వారు ఎక్కడ ఉన్నారని ఫోన్ చేసి ప్రశ్నించారు. పని తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. పారిశుధ్య సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ పెంచాలని అసిస్టెంట్ కమిషనర్‌కు కమిషనర్ షఫీ ఉల్లాకు సూచించారు. స్వీపింగ్ మిషన్ రోజుకు ఎన్ని గంటల, ఎంత దూరం శుభ్రం చేస్తోందని ప్రశ్నించారు. రాత్రి సమయంలో వీధులను శుభ్రం చేయాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికుల హాజరును తనిఖీలు చేశారు. 50వ డివిజన్ రహదారి పక్కన చెత్త ఉండటంతో వెంటనే తొలగించాలని ఆదేశించారు. తెల్లారి ప్రజలు రహదారుల పైకి రాకముందే రహదారులు శుభ్రంగా ఉంచాలని పారిశుధ్య కార్మికులు, స్వీపింగ్ మిషన్ డ్రైవర్లను కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య హెచ్చరించారు

మిర్చి విక్రయాలు సజావుగా జరగాలి

- అధికారులతో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సమీక్ష



మిర్చి మార్కెట్ సిబ్బందిపై సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంకలెక్టరేట్, జనవరి7(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో మిర్చి విక్రయాలు సజావుగా జరిగేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మిర్చి మార్కెట్ కార్యకలాపాలపై ఆయన సమీక్షించారు. మార్కెట్‌కు సీజన్‌లో వచ్చే రాబడులు, హోం గార్డ్స్ కేటాయింపు, మిర్చిధరహెచ్చు, తగ్గుదల, ఫైర్‌ఇంజన్ ఏర్పాటు, యార్డులో సౌకర్యాలు తదితర అంశాలపై ట్రేడర్లు,కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం, పోలీస్, ఫైర్, మునిసిపల్, మార్కెటింగ్, వ్యవసాయశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో 59వేల ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారని, లక్షా18 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని అంచనా ఉందన్నారు. జిల్లా మిర్చి యార్డుకు ఖమ్మం జిల్లాతో పాటు సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల నుంచి పంట వచ్చే అవకాశం ఉందన్నారు. ఖమ్మం ఏఎంసీ. పరిధిలో 18 లక్షల బస్తాలను భద్రపరిచేందుకు 19కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయని, ఖమ్మంమార్కెట్ యార్డులో మిర్చి సీజన్ సందర్భంగా అదనంగా20మంది సిబ్బందిని ఏర్పాటు చేయాలని, మార్కెట్ యార్డ్ వద్ద భద్రత కోసం 20మంది హోంగార్డులను కేటాయించాలని అదనపు కలెక్టర్ సూచించారు. మార్కెట్ యార్డు వద్ద మిర్చి పంట విక్రయాల నేపథ్యంలో అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉండేలా చూడాలని అదనపు కలెక్టర్ తెలిపారు. విక్రయాల సమయంలో మార్కెట్ యార్డు దగ్గర పటిష్ట భద్రత, ఏలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లామార్కెటింగ్‌శాఖఅధికారి ఎంఎ. అలీమ్, ఏసీపీ యూఎస్.రాజు, నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమీషనర్ షఫీఉల్లా, ఖమ్మం మార్కెట్ కమిటీ సెలక్షన్‌గ్రేడ్ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన సదస్సు

ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి7 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ డిజిటల్ చెల్లింపులు, ఆర్థికసేవలకు సంబంధించిన ఫిర్యాదులపవై ఆర్‌బీఐ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్ ఆర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ ప్రతినిధి హెచ్.డి.దైమని మాట్లాడారు. విద్యార్థులు ఆన్లైన్ బ్యాంకింగ్‌లో సైబర్ నేరగాళ్ల నకిలీ సమాచారంపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. వివిధ ఫిర్యాదులను స్వీకరించే అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్స్ ఏ.ఎల్. ఎన్‌శాస్త్రి, బానోత్‌రెడ్డి, సునంద, మెంటార్ వేలాద్రి, సురేష్ కుమార్ డి.శ్రీకాంత్, డిప్యూటీ అంబుడ్స్మన్ కళ్యాణ్ కుమార్, జగదీష్, క్రిష్ణ కుమార్ పాల్గొన్నారు.

కేఎంసీలో అంతర్గత బదిలీలు

- చర్చనీయాంశంగా మారిన వరుస బదిలీలు
- త్వరలో పారిశుధ్య విభాగాలపై ఫోకస్
- కార్పొరేటర్ల సిఫారసుతో తిష్టవేసిన వారిలో అలజడి



ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి7(ఆంధ్రజ్యోతి): కొత్తసంవత్సరం ప్రారంభం నుంచి ఖమ్మం నగర పాలక సంస్థను కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రక్షాళన దిశగా చర్యలు చేపట్టారు. ఉద్యోగుల పనితీరును నిశితంగా పరిశీలించిన ఆయన కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారు. రాజకీయ, ఉద్యోగ సంఘాల అండున్న ఇద్దరు ఉద్యోగులను ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి ఇతర మున్సిపాలిటీలకు బదిలీ చేశారు. ఆ చర్చ కేఎంసీలో ముగియకుముందే తన ఛాంబర్ నుంచి అంతర్గత బదిలీలు చేస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ షఫీలో పనిచేస్తున్న నాల్గో తరగతి ఉద్యోగి ప్రసాద్‌ను మెప్మా పీడీకి సహాయకుడిగా బదిలీ చేశారు. ఇంజనీరింగ్ ఈఈ వద్ద పని చేస్తున్న ఉద్యోగి ఐలయ్యను కమిషనర్ ఛాంబర్‌కు మార్పులు చేశారు. కారుణ్య నియామకంలో ఉద్యోగంలో చేరిన సాయినాథ్‌ను ఈఈ చాంబర్‌కు కేటాయించారు. పట్టణ ప్రణాళిక విభాగంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కే.రవిని ప్రజావాణి, ఆసరా, ఆర్‌టీఐ విభాగాలకు స్థాన చలనం చేశారు. రెవెన్యూ విభాగం వద్ద పనిచేస్తున్న నాల్గోతరగతి ఉద్యోగి మాధవిని పారిశుధ్య విభాగానికి కేటాయించారు. కాగా కేఎంసీ మెనేజరుగా, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న విజయానంద్‌ను డోర్నకల్ మున్సిపాలిటీ మెనేజరుగా బదిలీ చేస్తూ రాష్ట్రస్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఏ విభాగం నుంచి వచ్చారో పరిశీలన

ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య కార్యాలయంలోని ప్రతీ ఉద్యోగి వివరాలను క్షుణంగా పరిశీలిస్తున్నారు. ఏ ఉద్యోగి ఏ కేటగిరిలో కేఎంసీలో ఉద్యోగాలకు వచ్చారనే విషయాలను పరిశీలిస్తున్నారు. సుడా నుంచి నియామకాలు జరిగిన కాంట్రాక్టు ఉద్యోగుల కొనసాగింపుపై వివరాలు పరిశీలించారు. పారిశుధ్య విభాగంలో తల్లి,దండ్రులు పనిచేస్తుండగా వారి స్థానంలో నియామకం జరిగి పారిశుధ్యానికి వెళ్లకుండా గత ప్రభుత్వంలో పదుల సంఖ్యలో కేఎంసీలో తిష్టవేశారు. పది, ఇంటర్ కంప్యూటర్ డీసీఏ ధ్రువపత్రాలతో కంప్యూటర్ అపరేటర్లుగా టైంపాస్ చేసే వారి సంఖ్య 20కుపైగా చేరింది. దీంతో వారి పనితీరుపై కమిషనర్ నివేదికలు తెప్పించుకున్నట్లు తెలుస్తోంది.

పని చేయని ఉద్యోగుల్లో అలజడి

మరోవైపు ఖమ్మం నగరంలో పారిశుధ్య పనులు చేసేందుకు కార్మికుల కొరత ఏర్పడింది. నూతనంగా నియామకాలు చేసేందుకు కేఎంసీలో బడ్జెట్ నిధులు సరిపోవటం లేదు. దీంతో కేఎంసీలో పారిశుధ్యం కోసం నియామకం జరిగిన వారిని పారిశుధ్య కార్మికులకు పంపేందుకు సిద్ధం చేసినట్లు కేఎంసీలో చర్చ జరుగుతుంది. దీంతో పనిలేకుండా తిరిగే కేఎంసీ ఉద్యోగుల్లో అలజడి ఏర్పడింది.

ఘనంగా బ్రెయిలీ జయంతి



నివాళులర్పిస్తున్న డీడబ్ల్యూవో

ఖమ్మంఖానాపురం హవేలి, జనవరి7 (ఆంధ్రజ్యోతి): లూయిస్ బ్రెయిలీ 216వ జయంతిని ఖమ్మం నగరంలోని పాకబండ పార్క్‌లోని లూయిస్ బ్రెయిలీ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి, 23వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మఖ్బుల్ విజువల్లి ఛాలెంజెడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, అన్‌ఎంప్లాయిస్ బ్లైండ్‌అసోసియేషన్ అధ్యక్షుడు వీరబాబు,అంధఉపాధ్యాయులు నాగేంద్రమ్మ, ఎమ్మెస్‌రావు, వసంతరావు ధర్మసాయి తదితరులు హాజరయ్యారు. లూయిబ్రెయిల్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కటింగ్ చేయించారు.ఈ కార్యక్రమంలో జ్యోతినివాస్, ప్రత్యేక పాఠశాల అంధబాలబాలికలు, జిల్లా నుంచి విచ్చేసిన అంధులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

చందు చిత్రానికి జాతీయ స్థాయి అవార్డు



ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి7(ఆంధ్రజ్యోతి): రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఫొటోగ్రాఫర్ చందు చిత్రానికి జాతీయస్థాయిలో అవార్డు దక్కింది. ఈనెల 5, 6నఒడిస్సాలో హుస్సేన్‌ఖాన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఫొటోవర్క్ షాప్ నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిస్సా రాష్ట్రాలకు చెందిన 120 మంది ఫొటోగ్రాఫర్స్ పాల్గొన్నారు. గిరిజన మహిళలకు చెందిన చిత్రానికి చందుకు జాతీయ స్థాయి అవార్డు దక్కింది.

ఎస్సీ కమ్యూనిటీ భవనం పేరు మార్పు

- కమ్యూనిస్టు నుంచి హరిజన యువజన సంఘం భవనంగా మార్పు
- కమ్యూనిటీ భవన కమిటీ కృతజ్ఞతలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



Khammam Municipal Corporation

Owner Name: Zaheerpura Harijana Yuvajana Sangham Community Hall

Door No: 3-8-81 Locality: Khammam

ULB Name: Khammam District: Khammam

As On Date: 02-12-2024

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి7(ఆంధ్రజ్యోతి) ఖమ్మంనగర పాలక సంస్థలోని రెవెన్యూ విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఖమ్మం నగరంలోని బుర్హన్‌పురం ఎస్సీ కమ్యూనిటీ భవనం పేరు కాస్తా ఎస్సీ కమ్యూనిస్టు భవనంగా మారిపోయింది. దీంతో రెండేళ్ల పాటు భవన కమిటీ సభ్యులు కేఎంసీ చుట్టూ పేరు మార్పు కోసం ప్రదీక్షణలు చేశారు. సమస్యను తెలుసుకున్న 'ఆంధ్రజ్యోతి' నవంబరు 26న 'ఎస్సీ కమ్యూనిటీ భవనాలకు.. కమ్యూనిస్టు భవనాలుగా నామకరణం ' కథనం ప్రచురితమైంది. దీంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. ఎస్సీ కమ్యూనిటీ భవనం పేరు మార్పులు చేయాలని ఆర్వో శ్రీనివాసరావును ఆదేశించారు. దీంతో పేరు మార్పులు జరిగాయి. కమ్యూనిటీ సభ్యులు కోరిన విధంగా జహీర్‌పుర హరిజన యువజన సంఘం కమ్యూనిటీ హాల్‌గా ఆన్‌లైన్‌లో మార్పులు జరిగాయి.

ఎంతో సంతోషంగా ఉంది
తోళ్ల ఈశ్వర్‌మాదిగ



ఎస్సీకమ్యూనిటి భవనం పేరు మార్పు సాంకేతికంగా తప్పుగా నమోదైంది. కేఎంసీ చుట్టూ రెండేళ్లు తిరిగాం. కానీ మార్పు రాలేదు. ఆంధ్రజ్యోతిలో వార్త వచ్చిన తర్వాత కేఎంసీ అధికారులు జహీర్‌పుర హరిజన యువజన సంఘం కమ్యూనిటీహాల్‌గా ఆన్‌లైన్‌లో మారింది. 'ఆంధ్రజ్యోతి'కి కమ్యూనిటీ భవనం కమిటీ తరుపున ఎంతో కృతజ్ఞతలు.

ట్రాన్స్‌జెండర్లకు సంఘాల ఏర్పాటుపై అవగాహన

ఖమ్మంసంక్షేమ విభాగం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ ట్రాన్స్‌ండర్స్‌తో మాట్లాడి, ప్రతీ పది మందితో ఒక ఎస్‌హెచ్‌జీ సంఘాన్ని ఏర్పాటు చేయాలని, గతంలో ఖమ్మంలో ఏర్పాటు చేసిన అర్ధనారీశ్వర సంఘంతో యూనిట్ నెలకొల్పాలని జిల్లా నైపుణ్యాల నిపుణురాలు(డీఎంసీ) సుజాత పేర్కొన్నారు. మంగళవారం మెప్మా పరిధిలోని రిసోర్స్ పర్సన్స్(ఆర్పీ)ల వారీగా రివ్యూ నిర్వహించారు. స్త్రీనిధి రుణాల రికవరిలు, కరోనా సమయంలో పెండింగ్‌లో ఉన్న రుణాల బకాయిలు, చెల్లించినా బ్యాంకు ఖాతాలకు జమ కాని సాంకేతిక సమస్యలు, ట్రాన్స్‌జెడర్ల సంఘాలు, నూతనంగా మహిళ స్వయం సహాయక ఏర్పాటు, బ్యాంకు లింకేజీలపై ఆర్పీల వారీగా సమీక్షించారు. మెప్మా లక్ష్యాల మేరకు నూతన సంఘాలను ఏర్పాటు చేసి ఖమ్మాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. మార్చి నెల వరకు నూరుశాతం లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. టీఎంసీ సుజాత, స్త్రీనిధి ఆర్ఎం రవీంద్ర నాయక్, సీవోలు ఉపేంద్ర, సల్మా, ద్రౌపతి, రోజా తదితరులు పాల్గొన్నారు.

ప్రియదర్శినిలో వైభవంగా సంక్రాంతి సంబురాలు





ముగ్గు వేస్తున్న యువతి, వేడుకల్లో పాల్గొన్న కళాశాల చైర్మన్ నవీన్

ఖమ్మంరూరల్,జనవరి7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సంక్రాంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు.విద్యార్థులురంగురంగుల ముగ్గులు, హరిదాసు, బోగి మంటలతో సందడి చేశారు. కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు మాట్లాడుతు విద్యార్థుల్లో విలువలు, సంప్రదాయం, సంస్కృతిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సంప్రదాయాలను చాటిచెప్పేందుకు ఇసుక తిన్నెలపై నిర్మించిన మట్టి గుడిసెలతో సినిమా షూటింగ్‌ను తలపించేలా ఉన్నాయాన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, ప్రిన్సిపల్ గోపాల్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ ముఖేష్ నిందితులను కఠినంగా శిక్షించాలి

ఖమ్మంకలెక్టరేట్,జనవరి7(ఆంధ్రజ్యోతి): జాతీయ మీడియా జర్నలిస్ట్ ముఖేష్ చంద్రకర్‌ను పాశవికంగా హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్)డిమాండ్ చేశారు.మంగళవారం ఖమ్మంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించే విధంగా పటిష్టమైన చట్టాలు తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పలువురు విలేకరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి వెంట నడుద్దాం

ఎస్సీ వర్గీకరణను సాధిద్దాం

పిడమర్తి, వక్కలగడ్డ

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంట నడిచి ఎస్సీ వర్గీకరణనుసాధిద్దామని రాష్ట్రకాంగ్రెస్ నాయకుడు పిడమర్తి రవి, మాజీ టీపీసీసీ కార్యదర్శి వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం నగరంలోనిప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కలిపించి జిల్లాల వారీగా వర్గీకరణ చేపట్టాలన్నారు. జిల్లాలో పది నియోజకవర్గాలలో గెలుపోటములను నిర్ణయించేది మాదిగ సామాజిక వర్గమేనన్నారు. జిల్లాలో రెండు ఎస్సీ నియోజకవర్గాలున్నప్పటికి మాదిగ సామాజికవర్గానికి ప్రాతినిధ్యం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నామినేటెడ్ పదవుల్లోను, రాష్ట్రజిల్లా కాంగ్రెస్ పదవుల్లోను మాదిగ సామాజికవర్గానికి దామాషా ప్రకారం అవకాశాలు కలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపైమాదిగ సామాజికవర్గానికి నమ్మకం ఉందని, కచ్చితంగా ఆయన శాస్త్రీయబద్ధంగా చేస్తారనే నమ్మకం ఉందన్నారు. ఈ సమావేశంలో మాదిగ జేఏసీ ఉపాధ్యక్షుడు మట్టే గురుమూర్తి, తెలంగాణ ఎంఆర్‌పీఎస్ రాష్ట్రకన్వీనర్ నందు నర్సింహారావు, తోళ్ల రాకేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఓపెన్‌డోర్‌జనరల్ మేనేజర్ రాకేసిన్హాచే న్యూఇరా పాఠశాలలో గణిత,సైన్స్ ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంతో విద్యార్థుల అభ్యాసాన్ని మెరుగు పరచడానికి, విద్యాప్రమాణాలను పెంచడానికి సైన్స్, మ్యాథ్స్ రెండింటిలో 2025-26లో 'థింకింగ్‌క్లాస్‌రూమ్'ని పరిచయం చేయబోతున్నామని పాఠశాల చైర్మన్ ఐ.వి.రమణారావు, డైరక్టర్ పి.భూమేశ్వరరావు తెలిపారు. ఉపాధ్యాయులకు మెరుగైన బోధనకు ఈశిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. లేఖనా సామర్థ్యాన్ని, సృజనాత్మకతను పెంపొందిస్తుందన్నారు.

వేగం కన్నా.. ప్రాణం మిన్న

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో మంగళవారం రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులందరితో రోడ్డు భద్రత గురించి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులు వేగం కన్నా, ప్రాణం మిన్న' అనే నినాదంతో విద్యార్థులందరూ"హెల్మెట్ లేని ప్రయాణం నేరం" అని, ట్రాఫిక్ రూల్స్‌ను అందరూ పాటించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ ఎస్ఐ సాగర్ బాబు ట్రాఫిక్ రూల్స్ సిగ్నల్స్ గురించి వివరించారు. సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి. నాగేంద్ర కుమార్ రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నీలిమా, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాసులు



ర్యాలీ నిర్వహిస్తున్న పాఠశాల డైరెక్టర్లు

ఆర్టీసీ ఆధ్వర్యంలో..

ఖమ్మం ఖానాపురంహవేలి: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం రీజియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం కొత్తబస్టాండ్‌లో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఆర్టీసీ డ్రైవర్ ఉద్యోగాల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రాఫిక్ పోలీస్ ఏసీపీ శ్రీనివాసులు ఖమ్మం రవాణాశాఖ కార్యాలయ మోటార్‌వెహికల్ ఇన్స్పెక్టర్ రమణ హాజరయ్యారు. రమణ మాట్లాడుతూ బస్సులను నడిపేటప్పుడు ఏకాగ్రతతో నడపాలని,సెల్ ఫోన్‌డ్రైవింగ్ చేస్తూ బస్సులను నడపవద్దని అన్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమైన ప్రయాణమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్) పవిత్ర, ఖమ్మం డిపో మేనేజర్ దినేష్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్లు రామయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు..

రోడ్డు భద్రతపై రవాణాశాఖ, ఆర్టీసీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు

హెల్మెట్ వాడకంపై అవగాహన

తిరుమలాయపాలెం: ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించి ప్రాణాలు రక్షించుకోవాలని తిరుమలాయపాలెం ఎస్ఐ కూసుపుడి జగదీష్ అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెంలో హెల్మెట్‌వాడకంపై రోడ్డుభద్రతావారోత్సవాలలో భాగంగా అవగాహన కలిపించారు. మద్యం సేవించి వాహనాలు నడపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ హరి, పీసీలు వీరస్వామి, లచ్చు, రాజు పాల్గొన్నారు.



పంటలకు
మద్దతు ధర కల్పించాలి

» అఖిల భారత ఐక్యరైతు సంఘం వైరా డివిజన్ కార్యదర్శి పాశం అప్పారావు

కొణిజర్ల, జనవరి7(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం వైరా డివిజన్ కార్యదర్శి పాశం అప్పారావు డిమాండ్ చేశారు. ఈనెల 9న కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం తీగల బంజర గ్రామంలో ఆ సంఘం ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు భూములకు రైతు భరోసా ఒకేసారి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సన్నకారు, చిన్నకారు, వ్యవసాయ కూలీలుకు రుణమాఫీ చేయాలని, గ్రామీణ ఉపాధి కూలీలకు రోజుకు రూ. 600 లు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మాస్‌లైన్ నాయకులు నుణావతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా పాఠశాల భవన నిర్మాణం

» పట్టించుకోని అధికారులు » పాఠశాల భవనాన్ని త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని వినతి

కారేపల్లి, జనవరి7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రొట్టమాకురేవు గ్రామంలో రెండేళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన మనఊరు మనబడి పాఠశాల భవననిర్మాణం పునాది దశలోని నిలిచిపోయింది. రూ.23 లక్షల వ్యయంతో రెండు గదుల నిర్మాణాన్ని అధికారులు అమోదించారు. కాగా సంబంధిత కాంట్రాక్టర్ ఎస్ఎంసీ ఛైర్మన్ రాంబాబు పనులు ప్రారంభించారు. పునాది దశ పూర్తి అయిన తరువాత దానికి సంబంధించిన బిల్లు కోసం అనేకమార్లు అధికారుల చుట్టూ తిరిగాడు.

అయినా అధికారులు బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణం పనులు నిలిపేశాడు. యుపీఎస్ పాఠశాల విద్యార్థుల కోసం చేపట్టిన భవనాల నిర్మాణం పునాది దశలోనే నిలిచిపోవడంతో అది ఎప్పటికీ పూర్తి అవుతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పునాది దశలోనే నిలిచిపోయిన మనఊరు మనబడి పాఠశాల నిర్మాణం

బిల్లులు చెల్లించాలి

● రాంబాబు, కాంట్రాక్టర్



పాఠశాల భవననిర్మాణం కోసం రూ.ఐదు లక్షలు అప్పు చేసి పాఠశాల నిర్మాణాన్ని ప్రారంభిచాను. బేస్‌మట్టం వరకు నిర్మాణం చేసిన అధికారులు స్పందించి బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులపాలయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బిల్లులు చెల్లించాలి.

మహిళలను కించపరిస్తే సహించేది లేదు: ఎమ్మెల్యే రాగమయి



బిల్లుపాడులో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి

తల్లాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని 27గ్రామాల్లో 97మంది లబ్ధిదారులకు రూ.35లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఇంటింటికి వెళ్లి ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తల్లాడ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే ప్రియాంకగాంధీ బుగ్గల్లా రోడ్లు వేయిస్తానని ఒక మహిళను అగౌరవపర్చేలా మాట్లాడిన బీజేపీ నాయకుడు రమేష్ బేదురి వ్యాఖ్యలను ఆమె ఖండించారు. ఇప్పటికైనా తన తప్పు తెలుసుకొని ప్రియాంక గాంధీకి బేదురి బహిరంగ క్షమాపణలు చెప్పాలని లేకపోతే బీజేపీ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ దిరిశాల నర్సింహారావు, ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్ వనజ, ఎంపీవో శ్రీదేవి, ఎస్ఐ బి.కొండల్‌రావు, ఈవో కృష్ణారావు, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతి రెడ్డి, కాపా సుధాకర్, ఏఎంసీ మాజీ ఛైర్మన్లు దుండేటి వీరారెడ్డి, దీవెల కృష్ణయ్య, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, జక్కంపూడి కిషోర్, రాయల రాము, రవి, గోవిందు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'గురుకులాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలి'

కొణిజర్ల, జనవరి7(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలకు సొంతభవనాలు ఏర్పాటు చేయాలని పీడీఎస్ యూ జిల్లా కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ డిమాండ్ చేశారు. సోమవారం పీడీఎస్‌యే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం బాలుర మైనార్టీ గురుకులంలో 650 మంది విద్యార్థులు ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అభ్యసిస్తున్నారని, అద్దె భవనం కావడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపాడు. ఈ కార్యక్రమంలో రవి, సంపత్, కిరణ్, సాగర్ పాల్గొన్నారు.

రైతు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొంటాం

» డీసీఎంఎస్ ఛైర్మన్ శ్రీనివాసరావు



వైరా ఏఎంసీలో ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

వైరా, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులోని డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం కొత్వాల పరిశీలించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యంలోని తేమశాతాన్ని, సన్న ధాన్యం నాణ్యతను పరిశీలించారు. మార్కెట్ యార్డులోని రైతులతో శ్రీనివాసరావు మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించిన ప్రతి రైతుకు మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500ప్రభుత్వ బోనస్‌ను బ్యాంకు ఖాతాలో జమచేస్తుందని తెలిపారు. రైతు సంక్షేమానికే కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ కె.సందీప్, వైరా ఏఎంసీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సెంటర్ ఇన్‌చార్జి బి.రాజు రైతులు పాల్గొన్నారు.

సమన్వయంతో కల్వర్టు నిర్మించండి

» అదనపు కలెక్టర్ శ్రీజ

వైరా, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపాడులో రిజర్వాయర్ ఎడమకాల్వపై శిథిలావస్థలో ఉన్న కల్వర్టును నీఇపారుదల, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు సమన్వయం చేసుకొని నిర్మించాలని అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయిస్తామని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ తెలిపారు. తమ గ్రామంలోని శిథిలమైన కల్వర్టు నిర్మాణానికి ఏడాది కిందట రూ.13.90లక్షలకు ప్రతిపాదనలు పంపించినా నేటికీ దాని నిర్మాణం చేపట్టలేదని ఫలితంగా దళితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ గరికపాడు సొసైటీ డైరెక్టర్ మేరుగు రత్నరాజు మరికొంతమంది చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం అదనపు కలెక్టర్ శ్రీజ కల్వర్టును సందర్శించి పరిశీలించారు. అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని స్పష్టం చేశారు. అనంతరం గరికపాడు హైస్కూల్లోని విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధించారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఎంపీడీవో సరస్వతీ, ఎంపీవో జ్యోత్స్నదేవి, ఐబీ ఏఈఈ వెంకట్రాములు, సొసైటీ డైరెక్టర్ రత్నరాజు, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.



శ్రీజను సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థ మహిళలు

ప్రయివేట్ ఆస్పత్రిని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

కల్లూరు, జవనరి 7 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని మాధవి ప్రయివేట్ ఆసుపత్రిని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పలు రికార్డులను, స్కానింగ్ రూమ్, ఆపరేషన్ థియేటర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సీతారం, ప్రభుత్వ వైద్యాధికారి నవ్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి

» ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు తూరుగంటి అంజయ్య

కొణిజర్ల, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు తూరుగంటి అంజయ్య అన్నారు. సోమవారం కొణిజర్లలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో లక్షలాది మందితో దండోర మోగించటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బెల్లంకొండ రవి మాదిగ, ఇలారపు మురళి, భాస్కర్ మాదిగ, శ్రీను, రవి, సుధాకర్, భద్రయ్య, జయన్న, చిన్నకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీ వేతనాల పెంపుపై హర్షం

తల్లాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పత్తి, మిర్చి హమాలీ కూలీల వేతనాలు ఐక్యతతో 11శాతం పెంచుకోవడం జరిగిందని ప్రగతిశీల హమాలీ అండ్ మిల్లు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు, టీయూసీఐ జిల్లా నాయకుడు షేక్.లాల్‌మియా అన్నారు. మంగళవారం పత్తి, మిర్చి వ్యాపార ప్రతినిధులు, హమాలీ యూనియన్ నాయకుల మధ్య వేతనాలపై చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా 11శాతం రెండేళ్లపాటు వేతనాలు పెంచేందుకు ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదిరింది. కార్యక్రమంలో దగ్గుల శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, షైలవరపు రామకృష్ణారావు, తోట మురళీ, కటికి వెంకటేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, చాపల నర్సింహారావు, పఠాన్ నాగూల్‌మీరా, గార్లపాటి నాగేశ్వరరావు, నల్గొండ వెంకన్న పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే

» జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు

మధిరటౌన్, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఎప్పుడు వచ్చిన మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీ అని, ముఖ్యమంత్రి అయ్యేది కేసీఆరేనని జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. మంగళవారం మధిర లోని పార్టీ కార్యాలయంలో ఎర్రుపాలెం మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లడుతూ కార్యకర్తలు ఎవరు నిరుత్సాహానికి గురికావద్దన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'కోడి పందేలు నిర్వహిస్తే సమాచారమివ్వండి'

సత్తుపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం సందర్భంగా కోడిపందేలు, పేకాట నిర్వహించడం నిషేధమని, ప్రజలు సమాచారాన్ని డయల్ 100, 87126 59167 నంబర్లకు కాల్ చేయాలని పట్టణ సీఐ టీ.కిరణ్ కోరారు. పేకాట, కోడిపందేల కేసులలోని నిందితులు, కోడికత్తులు తయారు చేసేవారు, కోడికత్తులు కట్టేవారు, పేకాట రాయుళ్లు మొత్తం 25మందికి మంగళవారం సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. మళ్లీ భవిష్యత్తులో పాల్గొనకుండా సత్తుపల్లి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచి రూ.లక్షకు బైండోవర్ చేశామన్నారు. తమకు సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

» దక్షిణ తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చింతా బాబు

ముదిగొండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల19న చేపట్టనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దక్షిణ తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చింతా బాబు, జాతీయ ఉపాధ్యక్షుడు, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ లంకా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం ముదిగొండలో నిర్వహించిన మధిర నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొత్తపల్లి నర్సింహ, మహిళా మండలి జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నర్సింహారావు, కృష్ణ, సంగయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీజీపీఏ జిల్లా కమిటీ సమావేశం

వైరా, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వైరాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం గొల్లమందల శ్రీనివాస్ అధ్యక్షతన తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. పేరెంట్స్ మండల కమిటీల నిర్మాణం, పరిశీలన, పనితీరు, లక్ష్యాల గురించి చర్చించారు. ఈనెల పదో తేదీన రాష్ట్ర కమిటీ జిల్లా సమావేశానికి హాజరవుతుందని తెలిపారు. రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు కోట లోకేష్, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు గొల్లమందల శ్రీనివాస్, ముత్యాల రాజు, పోతుల సుదర్శన్, వరకాల విజయకుమారి, మాతంగి అనిల్‌కుమార్, దర్శి కిరణ్, కొల్లి వర్మ, తంగిరాల నర్సింహారావు, ఆదూరి బాబు, గుత్తికొండ ప్రసాద్, పలు పాఠశాలల పేరెంట్స్ కమిటీల కార్యవర్గం నాయకులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన

ఏన్కూరు, జనవరి7(ఆంధ్రజ్యోతి): మానవ హక్కులపై ప్రత ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రఫి అన్నారు. మంళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన హ్యూమన్ రైట్స్ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసమావేశంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎస్‌బీఐ మేనేజర్ జగన్, హ్యూమనన్‌రైట్స్ జాతీయ అధ్యక్షుడు బొడ్డపాటి దాసు తదితరులు పాల్గొన్నారు

10న ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ముట్టడి

వైరా, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10వతేదీన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆశ వర్కర్ల సంఘం నాయకులు ప్రకటించారు. ఆశవర్కర్లకు రూ.18వేలు వేతనం చెల్లించాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా 10న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. మంగళవారం వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశాడే సందర్భంగా ఆశవర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేశారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు, ఆశవర్కర్లు ఆదిలక్ష్మి, సుజాత, రేణుక, గీత, అమృత, ప్రమీల, హైమావతి, రజిని, ఆదికుమారి, విజయ పాల్గొన్నారు.

కారేపల్లి, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఆశవర్కర్ల వేతనం రూ.18వేలకు పెంచాలని తెలంగాణ ఆశావర్కర్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 10న ఎమ్మెల్యేల ఇండ్ల ఎదుట జరిగే ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ కె.నరేందర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కొండబోయిన నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆశ వర్కర్లతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో వాంకుడోత్ కమల, జిల్లా నాయకురాలు ఎల్లబోయిన రాధా, కళ్యాణి, కుమారి, సర్వసతి, పద్మ, సుజాత, అచ్చమ్మ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కస్తాల సత్యనారాయణ

ఎర్రుపాలెం, జనవరి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనిగండ్లపాడు సాంఘిక సంక్షేమ ప్రభుత్వ వసతిగృహంలో షెడ్యూల్డు కులాల సంక్షేమ ఉపసంచాలకుడు కస్తాల సత్యనారాయణ విద్యార్థులతో కలిసి మంగళవారం రాత్రి బసచేశారు. ఆయన మాట్లడుతూ ప్రభుత్వ ఆదేశాలతో ప్రభుత్వ వసతి గృహాల్లో రాత్రి పూట బస చేసి వసతి గృహాలను పరిశీలిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో మధిర సహాయ సంక్షేమ అధికారి కొత్త వెంకటేశ్వరరావు, వార్డెన్ దశరథ్ పాల్గొన్నారు.

పండ్లు, దుప్పట్ల పంపిణీ

వైరా, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో తోటకూర శ్రీకాంత్ జన్మదినాన్ని పురస్కరించుకొని లయన్ కంటి ఆసుపత్రిలోని 25మంది రోగులకు పండ్లు, రొట్టెలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉండ్రు శ్యాంబాబు, వరలక్ష్మీ, గంగవరపు కిషన్, ఉయ్యూరు రామకృష్ణ, గోపి, చిన్నా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొణిజర్లలో...

కొణిజర్ల, జనవరి7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాల పాఠశాలల విద్యార్థులు సుమారు 1000 మందికి గ్రేస్ సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు దుప్పట్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. ఎస్ఐ సూరజ్ పాల్గొని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు వేణు, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, శ్రీవేణు, ఉమేష్, నరసింహరావు, శాంతకుమారి, కృష్ణయ్య, మార్క్ తదితరులు పాల్గొన్నారు.

బోనకల్‌లో..

బోనకల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బోనకల్, చిరునోముల గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలో చదివే విద్యార్థులందరికి మంగళవారం గ్రేస్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు, స్నాక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దామాల పుల్లయ్య, గ్రేస్ సేవా సొసైటీ నిర్వాహకులు బి. ఎర్నెస్ట్ పాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల కరపత్రం ఆవిష్కరణ

మధిరటౌన్, జనవరి7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మధిర సుందరయ్యనగర్‌లో నిర్వహించనున్న ముగ్గుల పోటీల కరపత్రాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంగళవారం మధిరలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. వార్డు కౌన్సిలర్లు మల్లాది వాసు, మల్లాది సవిత, సుందరయ్యనగర్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించనున్న ఈ పోటీలకు ముఖ్యఅతిథులుగా ఉప ముఖ్యమంత్రి భట్టి దంపతులతో పాటు ప్రముఖ సినీ నటులు శ్రీకాంత్, సురేఖవాణి, మీనా కుమారి, ప్రవీణతో పాటు యాంకర్ సుమ హాజరుకానున్నారు.

మధిరటౌన్, జనవరి7: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు పోలీస్ అధికారులు మంగళవారం మధిరలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు, వైరా ఏసీపీ రెహ్మాన్, మధిర, వైరా సీఐలు డి. మధు, సాగర్, మధిర టౌన్, రూరల్ ఎస్ఐలు సంధ్య, లక్ష్మీభార్గవి, చింతకాని ఎస్ఐ నాగుల్‌మీరా శుభాకాంక్షలు తెలిపారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న భట్టి

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

» సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి

కల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో నివేదిత, ఆర్టీసీ రూట్ ఆఫీసర్ కిన్నెర ఆనదరావు పాల్గొన్నారు.

వైరా, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని వైరా మోటర్ వాహనాల ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు. పల్లిపాడు, వైరాల్లో ఏఎంవీఐ రవిచంద్రతో కలిసి రోడ్డు భద్రత మాసోత్సవాలను విద్యాలయాలు, కార్యాలయాల్లో నిర్వహించారు. రవాణాశాఖ కానిస్టేబుళ్లు బడేసాహెబ్, ప్రసాద్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను
సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి

'జర్నలిస్టులపై దాడులను అడ్డుకోవాలి'

సత్తుపల్లిరూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై జరుగుతున్న దా డులను అడ్డుకోవాలని, దోషులను కఠినంగా శిక్షించాలని సత్తుపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మాదిరాజు సుధాకర్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జర్నలిస్ట్ ముఖేష్‌చంద్రకర్ హత్యకు నిరసనగా సత్తుపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎండీ. షైబుద్దీన్, రామిశెట్టి లక్ష్మణరావు, చిన్నేని బాలకృష్ణ, భీమిశెట్టి రఘురామారావు, తడికమళ్ల దేవదానం, తోట కిరణ్, బల్లెం చిరంజీవి, బేతి ఆనంద్, రాజేష్‌రెడ్డి, సురేష్, బండి ఏలాద్రి, శ్రీను, కొత్తపల్లి సుధాకర్, కాకర్ల జగన్ తదితరులున్నారు.




సత్తుపల్లిలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

తల్లాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): యువ జర్నలిస్టు ముఖేష్ చంద్రకర్ హత్యను నిరసిస్తూ మంగళవారం తల్లాడలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానుద్దేశించి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గుడిపల్లి నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు దుగ్గిదేవర అజయ్‌కుమార్, మోదుగు జయరాజు, రుద్రాక్ష నర్సింహాచారి, ఇటుకల చలపతిగౌడ్, గొడ్ల బాబూరావు, మెహరాజ్, శేషగిరిరావు, లాజర్, నారపోగు ప్రసాద్, నర్సింహారావు, పూనాటి శ్రీనివాసరావు, ఏసు పాల్గొన్నారు.

చింతకానిలో యూరియా నిల్వల పరిశీలన

చింతకాని, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): చింతకాని, నాగులవంచ గ్రామాల్లోని సొసైటీ గోదాముల్లోని యూరియా నిల్వలను ఏవో మానస మంగళవారం పరిశీలించారు. మార్క్‌ఫెడ్ ద్వారా నిల్వ ఉన్న గడ్డలు కట్టిన యూరియాను సొసైటీలకు సరఫరా చేస్తుండటంతో వాటిని కొనేందుకు రైతులు ముందుకు రాకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా యూరియా నిల్వలు, నాణ్యతను ఆమె తనిఖీ చేశారు. రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేస్తున్నామని, ప్రస్తుతం మండలంలో అధిక వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని అదనంగా నాణ్యమైన యూరియా సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఈవో మారగాని శ్రీనివాసరావు, సొసైటీ డైరక్టర్ కొల్లి గోవిందరావు, ఏఈవో రాము తదితరులు పాల్గొన్నారు.



యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

ఇండ్లు కోల్పోతున్న వారి సమాచారం సేకరణ

కారేపల్లి, జనవరి7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రెండవ రైల్వే లైన్ ఏర్పాటు సందర్భంగా ఇండ్లు కోల్పోతున్న వారి సమాచారాన్ని మండల ఆర్ఐ సామినేని నర్సింహారావు మంగళవారం సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన పూర్తి సమాచారం అధికారులకు అందచేయాలన్నారు. ఈకార్యక్రమంలో రైల్వే బోర్డు మెంబర్, బీజేపీ జిల్లా నాయకుడు తురక నారాయణ, కాంగ్రెస్ నాయకుడు తొగర శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

ధనుర్మాస వ్రత మహోత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేజర్లలో వేంచేసియున్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస వ్రత మహోత్సవాలు మంగళవారంతో 23వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ప్రవచనకర్త, ఉపన్యాస రత్న శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య స్వామి మాట్లాడుతూ భగవంతుడు కార్యరూపంగా అన్ని జీవులలో, అన్ని వస్తువులలో ఉండి వాటి నిలబెడుతున్నాడని, దీనికి సృష్టి అని పేరు పెట్టారన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకోవాలి

» ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ల సంఘం జిలా అధ్యక్షుడు ధర్నాసి బాలరాజు

కల్లూరు, జనవరి 7 (ఆంధ్ర జ్యోతి): సమస్యల సాధన కోసం ఎలక్ట్రీషియన్లు ఐకమత్యంగా ఉండాలని ఖమ్మం జిల్లా ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ల సంఘం అధ్యక్షుడు ధర్నాసి బాలరాజు పిలుపునిచ్చారు. మంగళవారం కల్లూరులో జరిగిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు జూపూడి జయరాజు, ఉపాధ్యక్షుడు ధర్నాసి కరుణాకర్ రావు, ఇల్లూరి రవి, సాయి, చారి, యస్‌కె. మోహిన్‌పాషా, నందిగం శ్రీహరి, గుండ్ల బాజాజీ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వే చేపట్టాలి: రైతు సంఘం

ఏన్కూరు, జనవరి7(ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ స్థానంలో ప్రవేశపెట్టిన భూభారతి నూతన రెవెన్యూచట్టంలో సమగ్ర భూసర్వే చేపట్టి అనుభవంలో ఉన్నప్రతి రైతుకు భూధార్ కార్డు ఇవ్వాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మంగళవారం ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసమావేశంలో దొంతబోయని నాగేశ్వరరావు, నండూరి శ్రీనివాసరావు, నేలపట్ల వెంకటేశ్వరరావు, లెనిన్ పాల్గొన్నారు.